J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 29 24.12.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

• మంత్రివర్గం

# మార్చి తర్వాతే మార్పు?

## విస్తరణపై వీడని ఉత్కంఠ

- మరికొంత సమయం ఇవ్వమంటున్న ప్రస్తుత మంత్రులు
- సంక్రాంతి నుండి ఉగాదికి మారిందంటున్న ముహూర్తం
- మార్చి తరువాతే మార్పులుంటాయంటున్న పార్టీ వర్గాలు
- పరిశీలనలో పాతిక జిల్లాలు.. పాతిక మంది అమాత్యులు

**ఇప్పుడు ఆంధ్ర రాజకీయాలు తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాయంటున్నారు రాజకీయ విశ్లేషకులు. రెండున్నరేళ్ళ తరువాత మంత్రివర్గంలో మార్పు చేస్తానని సాక్షాత్తు ముఖ్యమంత్రే గతంలో ప్రకటించి ఉండడంతో ఆ మార్పులో తమ పేరు ఉందా లేదా అన్న ఆసక్తి చాలామందిలో కనిపిస్తోందన్నది వారి అభిప్రాయం.**

మొత్తం 151 మందిలో ముఖ్యమంత్రిని మినహాయించగా మిగిలింది 150. వీరిలో 25 మందిని ఇప్పటికే ముఖ్యమంత్రి అందలం ఎక్కించారు. వాళ్ళు పోగా ఇప్పుడు మిగిలింది మరో 125 మంది. వీళ్ళతో పాటు శాసనమండలి సభ్యులు కూడా తోడవుతారు. వాళ్ళలో కూడా చాలామంది అమాత్య పదవిపై ఆశ పెట్టుకుని ఉన్నారు. పాతవారినందరినీ ఊడబెరికి అందరూ కొత్తవాళ్ళకి అవకాశం కల్పిస్తారన్న పుకారు గత ఆరునెలలుగా షికారు చేస్తోంది. ఈ తరుణంలో... ప్రభుత్వం పరిచయం చేసిన ఓటీయస్ పథకంపై వస్తున్న దుష్ప్రచారం, అకస్మాత్తుగా తగ్గిన మద్యం ధరలపై వినపడుతున్న కామెంట్లు, ఆన్‌లైన్‌లో సినిమా టిక్కెట్ల విక్రయంపై వెల్లువెత్తుతున్న విమర్శలు, ఉద్యోగుల డిమాండ్లు, పార్టీకి తలనొప్పిగా మారిన సుబ్బారావు గుప్తా ఉదంతం, అశోక గజపతిరాజు ఆరోపణలు, ప్రజలకు సంక్షేమ పాలన అందించడానికి ముఖ్యమంత్రి పడుతున్న తపన... ఇవేమీ వైసీపీ నాయకులకు పట్టడంలేదని, వాళ్ళ దృష్టాంతా విస్తరణపైనే ఉందన్నది రాజకీయ మేధావుల మాట.

ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా రెండున్నరేళ్లంటే 30నెలలు. డిసెంబర్ మొదటివారానికి 30 నెలల కాలం ముగిసింది. కానీ ఆశావహుల కోరిక మాత్రం తీరలేదు. మంత్రివర్గ విస్తరణ క్రిస్మస్, పెద్ద పండగ లేదా ఉగాది అంటూ వాయిదా పడుతూనే ఉంది. మొన్న మొన్నటివరకు క్రిస్మస్ లేదా సంక్రాంతి అంటూండిన పార్టీ వర్గాలు ఇప్పుడు ఉగాది అని సంకేతాలు ఇస్తున్నాయి.




### సమయం ఇవ్వండి...

**- పాత మంత్రుల మొర**

కరోనా మహమ్మారి పుణ్యమా అంటూ వచ్చిన లాక్‌డౌన్ వల్ల కొంతకాలం, ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ మరికొంత కాలం గడిచిపోయిందని, మరో ఆరునెలల సమయమైనా ఇస్తే పూర్తిస్థాయిలో ఇల్లు చక్కబెట్టుకుంటామని చాలామంది జూనియర్ మంత్రులు సీఎం వద్దా, పార్టీ పెద్దల వద్ద మొరపెట్టుకున్నారని అంటున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి కూడా వీరి గోడు ఆలకించి... మార్చి తరువాత చూద్దాంలే! అని అన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. నిజానికి ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రస్తుత మంత్రులు చేసింది కూడా పెద్దగా ఏమీలేదు. ప్రజలకి అవసరమైన పథకాల ద్వారా వాళ్ళని సంతృప్తిపరచే బాధ్యత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే తన భుజాలపైకి ఎత్తుకున్నారు తప్ప మంత్రుల పాత్ర అంతంత మాత్రమే. సాధారణంగా ముఖ్యమంత్రి అందించదలుచుకున్న సంక్షేమ పథకాలు, చేపట్టదలచిన అభివృద్ధి కార్యక్రమాలు తాను ప్రకటించి, అవి సక్రమంగా అమలు జరిగేలా మంత్రులు ఎమ్మెల్యేల చేత పర్యవేక్షింపచేస్తారు.

కానీ ఈ ప్రభుత్వంలో

10లో



# కండలేరు మట్టికట్టను పటిష్టవంతం చేస్తాం

## కలెక్టర్ చక్రధర్‌బాబు



కండలేరు మట్టికట్టను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు

కండలేరు మట్టికట్టకు ఎలాంటి సమస్య రాకుండా పటిష్టవంతం చేస్తామని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఇటీవల ఆయన కండలేరు జలాశయం వద్దకు వెళ్ళి వర్షాలు వరదల ధాటికి 6వ కిలోమీటర్ కుమ్మరిగుంట వద్ద మట్టికట్టపై ఉన్న మట్టి కొంత కిందకు జారి కుంగిపోయిన ప్రదేశాన్ని పరిశీలించారు. అధికారులు వెంటనే స్పందించి అప్పటికప్పుడు మట్టికట్టను బాగుచేయడాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ జలాశయం అధికారులను అభినందించారు. వరదకు దెబ్బతిన్న ప్రాజెక్టుల పనులన్నిటినీ యుద్ధప్రాతిపదికన చేయాలని నీటిపారుదల అధికారులను ఆదేశించారు. వరదలకు దెబ్బతిన్న గ్రామాల్లో రహదారులు, విద్యుత్, మంచినీరు తదితర సౌకర్యాలను పునరుద్ధరిస్తున్నామని, అధికశాతం పనులు కూడా జరిగాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 251 పక్కాఇళ్ళు దెబ్బతిన్నాయని, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ళకు 95వేలు, పాక్షికంగా నష్టపోయిన ఇళ్ళకు 5200 రూపాయల వంతున పరిహారం అందజేశామని చెప్పారు. ఎస్టీలు ఇళ్ళు నిర్మించుకునేందుకు అదనంగా మరో 15వేలు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. వరద సమయంలో కష్టాల పాలైన 50868 కుటుంబాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి 2వేల రూపాయల వంతున పరిహారం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# నగర పరిశుభ్రతే ముఖ్యం

## మేయర్ స్రవంతి



ఆరోగ్య విభాగం అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడమే ముఖ్యమని, ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్నంతా తొలగించి శుభ్రంగా ఉంచాలని, ఎలాంటి అలక్ష్యం లేకుండా చెత్తసేకరణ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని నగర మేయర్ స్రవంతి కార్పొరేషన్ ఆరోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆమె కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆరోగ్యవిభాగం అధికారులతో సమావేశమై తగు సూచనలిచ్చారు. ప్రస్తుత మంచుకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున చెత్త తొలగించిన వెంటనే ఆ ప్రాంతాలన్నిటా బ్లీచింగ్ చల్లి ఎలాంటి వైరస్‌లు రాకుండా ముందుజాగ్రత్తలు తీసుకునే ఏర్పాట్లు చేయాలని అధికారులకు చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విషయమై ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. ఆరోగ్యవిభాగం అధికారి వెంకటరమణయ్య, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

# జొన్నవాడ కామాక్షమ్మకు 33 లక్షల హుండీ రాబడి



జిల్లాలో ప్రసిద్ధమైన జొన్నవాడ కామాక్షి తాయి ఆలయానికి 33 లక్షలకు పైగానే హుండీ ఆదాయం వచ్చింది. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఈనెల 20న లెక్కించగా గత అక్టోబరు 5 నుంచి డిసెంబరు 20వ తేదీ వరకు హుండీల ద్వారా 33,13,549 రూపాయలు రాబడి వచ్చినట్లు ఆలయవర్గాలు పేర్కొన్నాయి. అదేవిధంగా 164.700 గ్రాముల బంగారు ఆభరణాలు, 367 గ్రాముల వెండి ఆభరణాలు కూడా భక్తులు ఈ హుండీల్లో సమర్పించారని, వీటితోపాటు కువైట్‌కు చెందిన 15.50 దినార్లు కూడా ఉన్నాయని ఆలయ ఇఓ వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ ఛైర్మెన్ చీమల రమేష్‌బాబు, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ చైతన్య, ధర్మకర్తల మండలి సభ్యుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయండి

### - జేసీ విదేహ్‌ఖరే

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విదేహ్‌ఖరే చెప్పారు. ఇటీవల ఆయన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగు గ్రామంలో కడుతున్న ఇళ్ళను పరిశీలించారు. లబ్దిదారులకు కేటాయించిన ఇళ్ళను త్వరితగతిన పూర్తిచేయాలని, వారికి బిల్లులను వెంటనే చెల్లించాలని, నిర్మాణాలు నాణ్యతగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## మూలస్థానేశ్వరుని హుండీ ఆదాయం 8.58 లక్షలు

నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఇటీవల ఆలయ హుండీలు లెక్కించగా ఈ ఏడాది సెప్టెంబరు నుంచి ఇప్పటిదాకా హుండీల్లో 8,58.161 రూపాయలను భక్తులు కానుకలుగా సమర్పించినట్లు ఆలయవర్గాలు పేర్కొన్నాయి. హుండీ లెక్కింపును దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ చైతన్యకుమార్, ఆలయ ఛైర్మెన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సభ్యురాలు విష్ణుప్రియ, ఆలయ ఇఓ వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

## అంకాళమ్మకు ప్రత్యేక పూజలు

రాపూరు మండలంలోని తూమాయి సమీపంలో కొలువై ఉన్న అంకాళ పరమేశ్వరి అమ్మవారికి ఈనెల 19న ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పూలంగిసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## గీతామయిలో అన్నదానం



నెల్లూరు బాలాజీనగర్‌లో ఉన్న గీతామయి బాలలు, వృద్ధుల ఆశ్రమంలో ఇటీవల శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ పేర్నపాటి శ్రీరామరాజు పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, సభ్యులు వెంకటేశ్వర్లు, రవి, ఆశ్రమ నిర్వాహకులు తమ్మినేని పాండు, సరళ తదితరులు పాల్గొన్నారు.

## పేద క్రైస్తవులకు చేయూత

మర్రిపాడు మండలంలోని చుంచులూరు మెయిన్‌లో ఉన్న పీటర్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో ఈనెల 19న పేద క్రైస్తవులకు నూతన వస్త్రాలను పంపిణీ చేసి తమ చేయూతనందించారు. 40 మంది క్రైస్తవులకు చర్చి నిర్మాణకర్తలు కొంత ధనం ఇవ్వగా, పాస్టర్లు మరికొంత చేర్చి క్రిస్మస్ సందర్భగా చర్చిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చర్చి పాస్టర్లు ఇశ్రాయిల్, కె.వెంగయ్య పాల్గొన్నారు.

# కొత్త దారుల్లో తెలుగు కవిత్వం

## డా. మేడిపల్లి రవికుమార్



కవి నాగరాజును సన్మానిస్తున్న పాతూరి అన్నపూర్ణ, డా. జయప్రద, చిన్ని నారాయణరావు తదితరులు

ఈ తరం కవులు కవిత్వాన్ని కొత్తదారుల్లో తీసుకెళ్తున్నారని, తమ చుట్టూ ఉన్న సామాజిక సమస్యల పట్ల స్పందించి నవ్యరీతిలో కవిత్వీకరిస్తున్నారని, ఇదెంతో అభినందనీయమని ప్రముఖ సాహితీవేత్త డా.మేడిపల్లి రవికుమార్ అన్నారు. ఈనెల 19న నెల్లూరు టౌన్‌హాలులో స్వర్గీయ పాతూరి మాణిక్యమ్మ స్మారక రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో చిత్తూరుజిల్లా కుప్పంకు చెందిన కవి పల్లిపట్టు నాగరాజు రచించిన 'యాలై పూడ్సింది' అనే కవితా సంపుటికి పురస్కారం లభించింది. పురస్కార ప్రదాత పాతూరి అన్నపూర్ణ 5 వేల రూపాయల నగదును కూడా బహుకరించి కవిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డా. మేడిపల్లి మాట్లాడుతూ నేటి తెలుగు కవిత్వం తీరుతెన్నులను వివరించారు. కవిత్వాన్ని అందరూ ఆదరించాలని కోరారు. నాగరాజు రచించిన కవితాసంపుటిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద మాట్లాడుతూ తన మాతృమూర్తి మాణిక్యమ్మ పేరుతో ప్రముఖ కవయిత్రి పాతూరి అన్నపూర్ణ గత ఎనిమిదేళ్ళుగా సాహిత్య పురస్కారాలు ప్రదానం చేస్తూ తమ తల్లిపేరును సార్ధకం చేయడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ప్రముఖ కవి చిన్ని నారాయణరావు మాట్లాడుతూ ఇలాంటి సాహితీ పురస్కారాలు, కార్యక్రమాల వల్ల కవులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని అన్నారు. సాహితీరంగ ప్రముఖులు డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఈతకోట సుబ్బారావు, అవ్వారు శ్రీధరబాబు, సర్వేపల్లి రామమూర్తి తదితరులు మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాలకి పాతూరి అన్నపూర్ణ చేస్తున్న సేవలను కొనియాడారు. తమ మాతృమూర్తి మాణిక్యమ్మ ప్రోత్సాహంతోనే తాను కవయిత్రిని అయ్యానని, తల్లి రుణం కొంతమేరకైనా తీర్చుకోవాలనే తపనతోనే తమ తల్లిపేరుతో ఏటా ఈ పురస్కారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. నెరసం అధ్యక్షులు ఏ.జయప్రకాష్ సభకు అధ్యక్షత వహించారు. ప్రముఖ కవులు, సాహితీవేత్తలు మెట్టు రామచంద్రప్రసాద్, డా.గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, మాటేటి రత్నప్రసాద్, వేదం సూర్యప్రకాశం, కనుపర్తి శ్రీనివాసమూర్తి, తోట సులోచన, స్రవంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత నిర్వహించిన కవి సమ్మేళనంలో అనేకమంది కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో దత్త జయంతి

శ్రీ దత్త జయంతిని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు నగరంలోని దత్తాత్రేయ మందిరాలు, సాయిబాబా ఆలయాల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో వేడుకలు జరిగాయి. స్వామివార్లకు విశేషపూజలు చేసి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద ఉన్న శ్రీ దత్త మందిరంలో స్వామివారికి అభిషేకాలు, విశిష్ట పూజలు నిర్వహించారు. చిల్డ్రన్స్‌పార్కు వద్ద ఉన్న శ్రీ సాయిసదన్‌లో ప్రత్యేకపూజలు చేశారు. రాత్రి స్వామివారికి పల్లకిసేవలు విశేషంగా జరిగాయి. ఏసి నగర్‌లోని కోదండరామపురంలో ఉన్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారికి పూజలు, అభిషేక సేవలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

## వేణుగోపాలస్వామి దేవాలయంలో..

# గోదాదేవి అమ్మవారికి అభిషేక సేవలు



పుష్పాలంకరణలో శ్రీ గోదాదేవి అమ్మవారు

ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా నెల్లూరు మూలాపేటలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో కొలువైవున్న గోదాదేవి అమ్మవారిని సుగంధభరిత పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేక సేవలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈ నెలరోజులు ఆలయంలో దీపారాధన మహోత్సవం జరుగుతుందని, భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు. దేవస్థానం ఛైర్మెన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఈ వేడుకను పర్యవేక్షించారు.

# బీరాపేరు బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

**- మంత్రి మేకపాటి గౌతంరెడ్డి**

బీరాపేరు దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాల వారిని అన్నివిధాలా ఆదుకుంటామని రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల సంగం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను లారీ ఢీకొని ఆటో బీరాపేరు వాగులో పడి నలుగురు మృతి చెందడం, మరో ఇద్దరు గల్లంతు కావడం తెలిసిందే. సంఘటనా స్థలాన్ని ఈనెల 22న మంత్రి గౌతంరెడ్డి కలెక్టర్ చక్రధర్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సంఘటనలో తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మారిన చిన్నారి నవదీప్(11)ను ఓదార్చి వై.ఎస్.ఆర్ భీమా పత్రాలను అందచేశారు. నవదీప్ భవిష్యత్తుకు ఏం ఇబ్బంది రాకుండా ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయంతో పాటు మరో రూ.10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంత్రి ప్రకటించారు. ఈ నగదును నవదీప్ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి భవిష్యత్ అవసరాల కోసం వినియోగించేలా చర్యలు తీసులోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ, వైయస్సార్ భీమా కింద రూ.15 లక్షలు ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి సాయం అందించడం జరుగుతుందన్నారు. వారి కుటుంబాల్లోని వారికి చదువుకునే బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటుందని, భాధిత కుటుంబంలో చదువుకున్న వారు ఎవరైనా ఉన్నట్లైతే వారి అర్హత, ఆసక్తికి తగ్గట్టు ఉద్యోగాలు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఆటో ప్రమాద సంఘటనలో బీరాపేరు వాగులో పడిపోయి గల్లంతైన వారి కోసం తీవ్రంగా శ్రమించిన అధికారులను, పోలీసు సిబ్బందిని, మత్స్యకారులను, స్థానికులను, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. మంత్రి వెంట ఆత్మకూరు పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్‌ఛైర్మెన్లు షేక్ సర్ధార్, శ్రావణ్‌కుమార్, ఆర్డీఓ చైత్రవర్షిణి, డి.ఆర్.డి.ఏ పీడీ సాంబశివారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



నవదీప్‌కు బీమా బాండ్ ఇస్తున్న మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, పక్కన కలెక్టర్ చక్రధర్‌బాబు

## బుచ్చి నగర పంచాయతీ తొలి సమావేశం

బుచ్చి నగర పంచాయతీ ఏర్పడిన తర్వాత తొలి సాధారణ సమావేశం డిసెంబరు 20న జరిగింది. ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన మునిసిపల్ కౌన్సిల్‌హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు వైస్‌ఛైర్మెన్‌లు, వార్డు మెంబర్లు, నగర పంచాయతీ కమిషనర్ పాల్గొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం కొత్త బస్టాండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, మరో 11 అభివృద్ధి పనుల విషయమై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు.

## హ్యాపీ బర్త్‌డే సీఎం సర్....



ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 21న తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.

**• కార్ల వైద్యుడు కన్నుమూశాడు**

## అన్నదేవుల సుధాకరరెడ్డి ఇక లేరు



అన్నదేవుల సుధాకరరెడ్డి డిసెంబర్ 20వ తేది ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 74 సంవత్సరాలు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. నెల్లూరు నగరంలో పేరుమోసిన భూస్వామ్య కుటుంబంలో అన్నదేవుల గోపాలకృష్ణారెడ్డి – పావనమ్మల సంతానంగా 1947 జులై 6వతేది సుధాకరరెడ్డి జన్మించారు. ఆయన బాల్య విద్యాభ్యాసం నెల్లూరు సిఏఎం హైస్కూల్‌లో జరిగింది. ఆ రోజుల్లోనే ఆయన చెన్నైలో ఆటోమొబైల్ ఇంజనీరింగ్ పూర్తిచేసి అనంతరం నెల్లూరులో స్థిరపడ్డారు. సుధాకరరెడ్డి సతీమణి ప్రభావతి కొంతకాలం క్రితం కన్నుమూశారు. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె పద్మావతి, రెండవ అమ్మాయి శిల్ప. పెద్దల్లుడు గుండ్రా సతీష్‌రెడ్డి, డిఆర్‌డిఓ ఛైర్మెన్‌గా భారతదేశ రక్షణ రంగంలో తమ సేవలందిస్తున్నారు. చిన్నల్లుడు నాగూరు మనోహర్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్‌గా మలేసియాలో పనిచేస్తున్నారు.

### మెకానిక్ సుధాకరరెడ్డిగా ప్రసిద్ధి

ఆటోమొబైల్ ఇంజనీరింగ్ చదివిన సుధాకరరెడ్డి శ్రీ వెంకటేశ్వర గ్యారేజ్ పేరుతో 1970 ప్రాంతంలో తన వృత్తిని ప్రారంభించారు. కార్ల కంపెనీలో పనిచేసే ఇంజనీర్లకు కూడా అంతుచిక్కని సాంకేతిక సమస్యలను కనిపెట్టి పరిష్కరించడంలో సుధాకరరెడ్డి దిట్ట. ముఖ్యంగా పాతతరం పెద్ద కుటుంబాలకు చెందిన ఫియట్, అంబాసిడర్ కార్లతో పాటు విదేశీ కార్లను కూడా క్షణాల్లో రిపేరు చేసి ఇవ్వడంలో అందెవేసిన చేయిగా సుధాకరరెడ్డి ఖ్యాతి గడించారు. కొద్దిరోజుల తరువాత తన గ్యారేజ్‌ని ఆటోనగర్‌కి మార్చినప్పటికీ తరువాతి కాలంలో టెక్కేమిట్టలోని తమ ఇంటిని ఆనుకుని తన స్వంత ప్రాంగణంలోనే గ్యారేజ్ నిర్వహించారు. ఇల్లు, గ్యారేజ్ ఒకే ప్రాంగణం కావడంతో అర్ధరాత్రి తలుపుతట్టినా పలికేవారు. ఆయన ఎంతటి మేధావో అంతటి సౌమ్యుడు, మితభాషి, నిగర్వి, ఏకసంథాగ్రాహి కూడా. ఒక్కసారి చూస్తే చాలు విషయాన్ని ఇట్టే పట్టేసేవారు. మెకానిక్ సుధాకరరెడ్డిగా జిల్లాలో ప్రాచుర్యం పొందారు. మంచి మనసున్న ఇంటిపెద్దను కోల్పోయిన సుధాకరరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ... శ్రద్ధాంజలి ఘటిస్తోంది 'లాయర్'.

**ఏపీలో బీచ్‌ల అభివృద్ధికి**

## ఏం చర్యలు తీసుకున్నారు?

ఆంధ్రప్రదేశ్‌లో భీమ్ పథకం కింద అభివృద్ధికి అవకాశం ఉన్న బీచ్‌లను ప్రభుత్వం గుర్తించిందా? అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్లమెంట్‌లో ఈనెల 20న ప్రశ్నించారు. వాటి అభివృద్ధికి ఏ మేరకు నిధులు కేటాయించారు?.. ఆ పురోగతి ఎంతవరకు వచ్చిందని కూడా అడిగారు. అందుకు కేంద్ర పర్యావరణ అటవీశాఖ మంత్రి అశ్వనీ కుమార్ చౌబె లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ రుషికొండ బీచ్‌తో సహా ఆంధ్రప్రదేశ్‌లో 5 బీచ్‌లను గుర్తించడం జరిగిందని, వీటిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 8.54కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.



ఎంపీ ఆదాల

## చాంపియన్‌గా డికెడబ్ల్యూ



విక్రమసింహపురి విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా క్రీడల పోటీల్లో నగరంలోని డికెడబ్ల్యూ కళాశాల చాంపియన్‌గా నిలిచింది. ఈ కళాశాలలోనే జరుగుతున్న ఈ పోటీల్లో డికెడబ్ల్యూ విద్యార్థినులు అన్ని విభాగాల్లోనూ తమ సత్తాచాటుకున్నారు. ఈనెల 22న జరిగిన ఫైనల్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. విజేతలను డికెడబ్ల్యూ కాలేజీ ప్రిన్సిపాల్ గిరి, అధ్యాపకులు అభినందించి బహుమతులు అందజేశారు.

## ఏపీకి ఎన్ని ఎలక్ట్రిక్ బస్సులు ఇచ్చారు?

"ఫేమ్ ఇండియా పథకం" కింద ఆంధ్రప్రదేశ్‌కు ఎన్ని ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 21న పార్లమెంట్లో ప్రశ్నించారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల, బ్యాటరీల తయారీలోనూ ఎవరికి అవకాశం ఇచ్చారని కూడా ప్రశ్నించారు? కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి క్రిషన్‌పాల్ గుర్జార్ అందుకు రాతపూర్వకంగా సమాధానమిస్తూ ఈ పథకం కింద ఆంధ్రకు 2015లో 40 ఎలక్ట్రిక్ బస్సులు, రెండో విడత 350 బస్సులను కేటాయించినట్లు తెలిపారు. ఇందులో విశాఖపట్నానికి 100, విజయవాడకు 50, అమరావతికి 50, తిరుపతికి50, కాకినాడకు 50, తిరుపతి అంతర్గత రవాణాకు 50 బస్సులను కేటాయించినట్లు తెలిపారు. అందుకు మొత్తం పదివేల కోట్ల రూపాయలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల ప్రత్యేక పథకం కింద ఉత్పాదకతతో ముడిపడిన ప్రోత్సాహక పథకం (పి.ఎల్.ఐ)ను ఇటీవల కేంద్రమంత్రివర్గం ఆమోదించినట్లు తెలిపారు. ఇప్పటికే వాహనాలను ఉత్పత్తి చేస్తున్న సంస్థలు ఈ ఎలక్ట్రిక్ వాహనాలను అనుబంధంగా ఉత్పత్తి చేసేందుకు ప్రోత్సాహకాన్ని ఇచ్చేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అందుకు 18,100 కోట్ల రూపాయలను కేటాయించినట్లు పేర్కొన్నారు.



## 'ప్రభా'తం

# 21 ఏళ్ళకు అమ్మాయి పెళ్లి

యువతుల కనీస వివాహ వయస్సును కేంద్రప్రభుత్వం 18 నుంచి 21 ఏళ్లకు పెంచాలని నిర్ణయించింది. ఇదెంతైనా శుభ పరిణామం. పెళ్లీడు వయసు పెంచినందువల్ల పెద్దగా ఉపయోగమేమీ ఉండదని కొందరు వాదిస్తున్నా ఇందువల్ల వల్ల యువతులకు అన్నివిధాలా మేలు జరుగుతుందనేదే అధికశాతం మంది అభిప్రాయం. పెళ్లీడు వయసు పెంచడం వల్ల ఆరోగ్యం విషయంలో ఎంతో మేలు జరుగుతుందని, మాతా శిశు మరణాలు తగ్గుతా యని భావిస్తున్నారు. అయితే, ప్రభుత్వం పెళ్లీడు వయసు పెంచడంతోనే సరిపెట్టుకోక వారికి సమాజంలో అన్నివిధాలా రక్షణకల్పించడం, వారు ఉన్నత చదువులు చదువుకోవడానికి చేయూతనందించడం ఎంతో ముఖ్యం. మహిళలకు అన్నిరకాలుగా ప్రభుత్వాలు, చుట్టూ ఉన్న సమాజం సహకారం అందించినప్పుడే మహిళా సాధికారత కూడా సాకారమవుతుంది.

పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటున్న మహిళాలోకానికి ఇది శుభవార్త. మహిళలకు వయసు రూపంలో ఎదురవుతున్న వివక్ష ఇంతకాలానికైనా తొలగిపోయేందుకు మార్గం సుగమం కావడం ఆహ్వానించదగ్గ మంచి పరిణామమే. యువతుల కనీస వివాహ వయస్సును కేంద్రప్రభుత్వం 18 నుంచి 21 ఏళ్ళకు పెంచాలని నిర్ణయించింది. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ సముచితమైన నిర్ణయం తీసుకున్నారు. ఇది త్వరలోనే చట్టరూపంలోనూ వస్తుందని భావిస్తున్నారు. ఆ చట్టం వస్తే 21 ఏళ్ళ వయసు కన్నా ముందే వివాహం చేయడం నేరమవుతుంది. ప్రత్యేకించి ఇలా పెళ్ళి వయసును పెంచడం వల్ల యువతులకు ఆరోగ్యం విషయంలో ఎంతో మేలు జరుగుతుందని అధికశాతం మంది భావిస్తున్నారు. మరికొంతమంది పెళ్ళి వయసు పెంచినంత మాత్రాన పెద్ద ఉపయోగం ఏమీ ఉండ దని, వివాహమనేది అమ్మాయిల వ్యక్తిగతమైన అభిప్రాయం ప్రకారమే జరగాలని, వివాహం విషయంలో వారికి తగ్గ ఆలోచనలు వారికుంటాయన్నది మరి కొందరి వాదన. మహిళలకు సాధికారత కల్పించడమే ముఖ్యం కానీ పెళ్ళి వయసు పెంచడం వల్ల పెద్దగా ఒరిగేదేమీ లేదనే వారు కూడా ఉన్నారు. అయితే, చిన్నవయసులో పెళ్ళి జరిగితే గర్భం దాల్చినప్పుడు సమస్యలు అధికంగా వస్తున్నాయని, అదే 21 ఏళ్ళు దాటితే శారీరకంగా మంచి ఎదుగుదలతో పాటు, మానసికంగా పరిణతి కూడా ఉంటుందని, కుటుంబ సమస్యలను అధిగమించే పరిజ్ఞానం కూడా వస్తుందని వైద్యనిపుణులు చెప్తున్నారు. అంతేకాకుండా పెళ్ళీడు పెంచడం ద్వారా మహిళలకు సాధికారతను కల్పించ చడం మరింత సులభతరమవుతుందని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు బాల్యవివాహాలను కూడా నిరోధించేందుకు ఇదెంతగానో ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. వాస్తవానికి మాతృమరణాలు, ముఖ్యంగా ప్రసూతి మరణాలను నివారించేందుకు ఆడపిల్లల పెళ్ళి వయసు పెంచాలన్నది ఎప్పటినుంచో అనుకుంటున్నా అది ఇన్నాళ్ళకు సాకారమైంది. ఏ వయసులో పెళ్ళి చేయాలి అనే విషయం నిర్ధారించడానికి కేంద్రం ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించి ఏ వయసులో గర్భం దాల్చవచ్చు, మాతృశిశు మరణాలను ఏ విధంగా తగ్గించవచ్చు వంటి విషయాలన్నిటినీ ఆమూలాగ్రం పరిశీలించి ఒక నిర్ధారణకు వచ్చాకే కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం సంతోషించదగ్గ విషయం.

ఇప్పటికీ దేశంలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరిగిపోతూనే ఉన్నాయన్నది అందరికీ తెలిసిన విషయమే. బాల్యవివాహాలు నేరమైనా అనేక కారణాలతో పెద్దలే ఈ వివాహాలను సైగ్గా జరిపేస్తున్న సంఘటనలు బోలెడు. మనదేశంలో అసలే పేదవర్గాల వారే అధికం. పేదింటి ఆడపిల్లల్లో ఎక్కువ శాతం మంది ఆహార సమస్యతోనో, పౌష్టికాహార లోపంతోనో అనునిత్యం బాధలు పడుతూనే ఉన్నారు. చిన్న వయసులో గర్భం దాలిస్తే ఒక్కోసారి ఆ సమస్యలు మరింత జటిలమై మాతృమరణాలు, శిశు మరణాలు సంభవిస్తూనే ఉంటాయి. అందులోనూ ఈ అధునాతన కాలంలో ఆడపిల్లలు చదువుల పట్ల ఎంతో ఆసక్తి చూపుతున్నారు. విద్యారంగంలో విజయబావుటాలు ఎగురవేస్తూ ముందుకు దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత చదువులు చదువుకోవడానికి మధ్యలో పెళ్ళివయసు పెద్ద అడ్డంకి కూడా. పెళ్ళికంటే ముందు చదువు ముఖ్యం. సమాజంలో మంచి స్థాయిలో ఎదిగి పెళ్ళి చేసుకోవడమే ఆనందం అనేవారి సంఖ్యే అధికం. ఉన్నత చదువులు చదవాలంటే సహజంగానే 21 ఏళ్ళ వయసు దాటుతుంది కూడా. ఉన్నత విద్య చదువుకున్న యువతి పెళ్ళి చేసుకుని తల్లి అయితే వారి కుటుంబం కూడా విద్యాసుగంధంతో సమున్నతంగా ఉంటుంది. అందుకే అనేకమంది తల్లిదండ్రులు తమ పిల్లల చదువులకే ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నారు. ఎంత కష్టమైనా ఆడపిల్లలను ఉన్నత స్థాయిలో చదివించుకోవాలని, వారికి మంచి జీవితాన్ని ప్రసాదించాలని తపనపడుతున్నారు. అందుకు తగ్గట్టుగానే ఉన్నత విద్యలభ్యసించడం ద్వారా అన్ని రంగాల్లో యువతులు తమ ప్రతిభాపాటవాలను నిరూపించుకుంటూ పురుషులతో సమానంగా ఉద్యోగావకాశాల్లోనూ పోటీపడుతున్నారు. దీనివల్ల ఉద్యోగాల్లో కూడా పురుషులతో పాటు స్త్రీలకు మంచి ప్రాధాన్యత లభిస్తుందని వేరే చెప్పనక్కర లేదు. ఇలా ఏ రకంగా చూసినా ఆడపిల్లల పెళ్ళీడు వయసు పెంచడం వల్ల ఉపయోగాలే కనిపిస్తున్నాయి. అయితే సమాజంలో నేటికీ ఆడపిల్లల పట్ల, యువతుల పట్ల ఎన్నో అరాచకాలు, అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. వాటి నుంచి ఆడపిల్లలకు, యువతులకు ప్రభుత్వపరంగా, సామాజికపరంగా మరింత పటిష్టవంతమైన భద్రతను కల్పించడం అన్నిటికన్నా ముఖ్యం. అదేవిధంగా ఆడపిల్లల చదువులకు, వారు ఉన్నతస్థాయిలో విద్యనభ్యసించేందుకు ప్రభుత్వాలు గతంలో కంటే ఎక్కువ రాయితీలు, ఆర్థిక సహాయ సహకారాలు అందించాలి. ఉన్నత చదువులే ప్రాతిపదికగా, ప్రతి యువతికీ ప్రభుత్వాల నుంచి అన్నివిధాలా చేయూత అందాలి. అప్పుడే వారు బాగా చదువుకుని, మంచి ఉద్యోగాలు సాధించి, కుటుంబాన్ని ఆదుకుంటూ కోరుకున్న వ్యక్తిని వివాహం చేసుకుని ఆనందంగా జీవించడంతో పాటు ఆరోగ్యవంతమైన శిశువులకు కూడా జన్మనిస్తారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం కూడా ఏర్పడుతుంది. పెళ్ళీడు వయసు పెంచడంతో సరిపెట్టుకోక ప్రభుత్వాలు ఆడపిల్లలకు రక్షణ కల్పించడంతో పాటు వారి విద్యావకాశాలకు, ఉన్నతికి పూర్తిస్థాయిలో సహకారం అందించడం వల్ల మరింతగా ప్రయోజనం ఉంటుంది. అప్పుడే మహిళా సాధికారత కూడా సాకారమవుతుంది.

# ధర్మాన్ని ప్రబోధించేదే.. భగవద్గీత



భగవద్గీత కంఠస్థ పోటీల విజేతలైన చిన్నారులతో నిర్వాహకులు

ధర్మాన్ని ప్రబోధించేదే భగవద్గీత అనీ, భగవద్గీత మానవాళికి ఒక గొప్ప వరమని, మానవులంతా సత్యనిష్టలతో ధర్మబద్ధమైన జీవితం గడపాలనే కర్తవ్యాన్ని ప్రబోధిస్తూ ఆ శ్రీకృష్ణపరమాత్మ భగవ ద్గీతను మనకు ప్రసాదించాడని వక్తలు పేర్కొన్నారు. ఇటీవల అల్లూరుపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భగవద్గీతలోని 'అక్షరపరబ్రహ్మ యోగం'పై కంఠస్థ పోటీలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, ధర్మప్రచార విభాగం వారు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భగవద్గీత జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని, నిష్కామకర్మ యోగాన్ని తెలుసుకుని ప్రతి ఒక్కరూ దైవీగుణాలతో జీవిస్తూ సమాజా నికి మార్గదర్శకులు కావాలని ఆకాంక్షిం చారు. విశ్వహిందూ పరిషత్ అల్లూరు ప్రఖండ అధ్యక్షులు పి.శ్రీనివాసులు, కార్యదర్శి కొండూరు పోలయ్య ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హ్యుమన్ జాగృతి, వాసవి క్లబ్ ప్రతినిధులు మొగిలి దయాకర్, వెడుపల పాటి సురేష్, అమరనాథ్ సురేష్, మొగిలి త్రివిక్రమ్, అమరా సుధాకర్, మిద్దె శ్రీనివాసులు, గీతా బోధకురాలు మొగిలి సుకన్య పాల్గొన్నారు.

ప్రముఖ అవధాని కోట రాజశేఖర్, విశ్రాంత తెలుగు పండితులు అనంత పద్మనాభశర్మ, ఉపాధ్యాయిని బడబాగ్ని పుష్పలత న్యాయనిర్ణేతలుగా వ్యవహ రించారు. ప్రథమశ్రేణిలో పి.వైష్ణవి, పి.మోక్షజ్ఞ, కె.హరిణి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ద్వితీయ శ్రేణిలో సిహెచ్ మనస్విని, ఎస్‌కె సమీన, పి.సాత్విక్‌లు, తృతీయ శ్రేణిలో ఎస్‌వి వాహిని, పి.కార్తికేయన్, బి.యశస్విని, వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. చతుర్థ శ్రేణిలో ఎస్‌వి నవ్య, కె.లక్ష్మి, పంచమ శ్రేణిలో కె.మీనాక్షి బహుమతులు సాధించారు. విజేతలను అందరూ అభి నందించి బహుమతులు అందజేశారు.

# కొత్త సంవత్సరం క్యాలెండర్ల ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బొందిలి సంఘం ప్రతినిధులు

జిల్లా బొందిలి సంఘం వారు 2022 కొత్త సంవత్సర క్యాలెండర్లను నెల్లూరు ఫత్తేఖాన్‌పేటలోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఈనెల 20న సంఘం సీనియర్ నాయకులు, రిటైర్డ్ ఏసిటిఓ ఎం.మార్కండేయసింగ్, బొందిలి సంక్షేమ, అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.కృష్ణసింగ్‌లు ఆవిష్కరించారు. జనవరి 9వ తేదీన నెల్లూరులోని శిఖరంవారివీధిలో ఉన్న ఆర్యవైశ్య కల్యాణమండపంలో జిల్లా బొందిలి సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఆర్.శ్రీనివాస్‌సింగ్, ఎ.నాగేంద్రసింగ్, కోటిసింగ్, భగవాన్‌సింగ్, ఎం.ప్రతాప్‌సింగ్, నవీన్‌సింగ్, గోవిందసింగ్, గిరిధర్‌సింగ్, ఎం.సాయిప్రసాద్‌సింగ్, సాగర్‌సింగ్, శివవాసుదేవసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల కష్టాలు తీరేదెప్పుడో!

ఈ-మెయిల్ ప్రజావాణి lawyerpatrika@gmail.com +91 98663 14741

జిల్లాలో రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఇటీవల వచ్చిన వరదల దెబ్బకు ఎక్కడ చూసినా పొలాల్లో నీళ్ళు నిలిచి పోయాయి. పంటలు వేసుకునే ఈ సీజన్‌లో ప్రకృతి కరుణించకపోవడం దురదృష్టం. మరోవైపు వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇంత చేసినా తీరా పంట చేతికి అందే సమయంలో ఏదో ఒక కష్టం దాపురిస్తూనే ఉంది. ఆరుగాలం శ్రమించి పంటలు పండించే అన్నదాతలకు ఈ కష్టాలు ఎప్పుడు తీరుతాయో మరి! రైతుల వద్ద ఉన్న పశువులకు కూడా ఈ సీజన్‌లో అనేకరకాల వ్యాధులు వస్తూనే ఉన్నాయి. బురదనీళ్ళల్లో తిరగడం వల్ల మూగజీవాలు కాలిగిట్టల్లో పగుళ్ళు ఏర్పడి వాటిలో బురద చేరి రోగాల బారినపడుతున్నాయి. సకాలంలో వైద్యం చేయించాలంటే ఎంతో కష్టంగా ఉంటోంది. పశువైద్యులు గ్రామాల్లో పర్యటిస్తూ మూగజీవాలకు వైద్యం చేసి ఆదుకోవాలి. ఈ బాధలిలా ఉంటే గోరుచుట్టుపై రోకటిపోటులాగా జిల్లాలో చాలా చోట్ల ఎరువులు, విత్తనాల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తున్నారు. అసలే కష్టాల్లో ఉన్న రైతులకు ఈ అదనపు భారం కూడా తప్పడం లేదు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా ఇష్టానుసారం ధరలు పెంచేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వీటి ధరలను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి!

జి. శంకరయ్య, చేజర్ల.

# గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే!

చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి.. పారిశుద్ధ్యాన్ని కాపాడాలి అంటూ అధికారులు నిత్యం హెచ్చరిస్తున్నా జిల్లాలోని అనేక గ్రామాల్లో ఆచరణకు రావడం లేదు. అసలే ఇటీవల వానలు, వరదలతో చాలా గ్రామాల్లో రోడ్లు బురదగుంటలుగా మారాయి. దాంతో పాటు చెత్తా చెదారమంతా కలిసి దుర్గంధభూయిష్టంగా తయారయ్యాయి. గ్రామాల్లో పంచాయతీల వారు నామమాత్రంగానే చెత్త ఏరివేత కార్యక్రమం చేపడుతున్నారన్నది అందరికీ తెలిసిన విషయమే. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని చెల్లాయపాళెం గ్రామంలోనైతే గ్రామమంతా చెత్తే. ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా చెత్తాచెదారాలు పేరుకునిపోయి ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు పారిశుద్ధ్యం పట్ల దృష్టిపెట్టి గ్రామాల్లో పర్యవేక్షణకు స్థానిక ప్రముఖులను, స్వచ్ఛంధసంస్థల వారిని, ప్రత్యేక సిబ్బందిని బృందాలుగా ఏర్పాటుచేసి ప్రతినిత్యం సమీక్షిస్తే కొంతలో కొంతైనా ప్రజలకు ఈ దుర్గంధం బాధ తప్పుతుంది.

– కె.కార్తీక్, బుచ్చిరెడ్డిపాళెం

# ఉపరాష్ట్రపతి భవన్‌లో ప్రముఖుల సందడి











కొత్త ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి నివాసం డిసెంబర్ 20వ తేదీ జాతీయ స్థాయి ప్రముఖులతో కళకళలాడింది. ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగిన వెంకయ్య – ఉషమ్మల మనుమరాలు **నిహారిక - రవితేజ**ల పెళ్ళి రిసెప్షన్‌లో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులతో పాటు, ప్రధాని నరేంద్రమోడీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్‌తో సహా పలువురు ప్రముఖులు పాల్గొని కొత్త దంపతులను దీవించారు.

## జిల్లా పారిశ్రామిక ప్రగతికి ఆద్యుడు

# 'నిప్పో' ఓబుళరెడ్డి

### - ఫౌండర్స్ డే సభలో శివప్రభాత్‌రెడ్డి



## తడ ఫ్యాక్టరీలో ఘనంగా 96వ జయంతి వేడుకలు

***నిప్పో బ్యాటరీల తయారీ కర్మాగారాన్ని 'ఇండోనేషనల్ లిమిటెడ్' పేరుతో 49 సంవత్సరాల క్రితం నెల్లూరులోను ఆ తరువాత పదేళ్ళకి తడలోనూ ప్రారంభించిన పొట్టిపాటి ఓబులరెడ్డి 96వ జయంతిని ఫౌండర్స్ దేగా డిసెంబర్ 19వ తేదీ ఆదివారం తడ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఓబుళరెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి వారికి నివాళులర్పించిన అనంతరం సభా కార్యక్రమం ప్రారంభమయ్యాయి.***



మోహనరామిరెడ్డి

హెచ్.ఆర్. అసోసియేట్ వైస్‌ప్రెసిడెంట్ పి.వి.మోహనరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆయన స్వాగతోపన్యాసం చేశారు. అతిథులను సభకు పరిచయం చేసిన అనంతరం ఫ్యాక్టరీలో గత ఏడాది కాలంగా జరిగిన ఉత్పత్తి, సాధించిన ఫలితాలు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల వివరాలు తదితర అంశాలను సభికులకు వివరించారు. కర్మాగారంలో పనిచేసే కార్మికులకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి పంపించిన అభినందన బొకేను కార్మిక నాయకులకు అందచేసి అలాగే వారి తరపున అభినందన బొకేను సంస్థ డైరెక్టర్ శంకరరెడ్డికి అందజేశారు.

తడ శాఖ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ, యాజమాన్యం ఇచ్చిన లక్ష్యాలను సాధించడంలో అనుకున్న సమయంకంటే ముందు ఉండడానికి నిరంతరం ప్రయత్నం చేస్తూనే ఉంటామన్నారు. కార్మికుల పక్షాన కార్మిక నాయకుడు కృష్ణయ్య మాట్లాడుతూ కార్మికుల కోసం సంస్థ తీసుకుంటున్న చర్యలను కొనియాడారు.

కుటుంబ వేడుకలా జరిగిన ఈ కార్యక్రమంలో కర్మాగార ఉద్యోగులు, కార్మికులు తమ కుటుంబసభ్యులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థలో పాతికేళ్ళుగా పని చేస్తున్న ఉద్యోగులను 5 గ్రాముల బంగారంతో సత్కరించారు. సంస్థ నిర్వహించిన అనేక అట పాటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఉద్యోగులు, కార్మికుల పిల్లలు సందడి చేశారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న లాయర్ పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)ని ఈ సందర్భంగా సత్కరించారు.

శివప్రభాత్‌రెడ్డితో పాటు సంస్థ డైరెక్టర్ శంకరరెడ్డి, హెచ్.ఆర్. వైస్ ప్రెసిడెంట్ మాత్యూస్ గుణశేఖరన్, హెచ్.ఆర్. అసోసియేట్ వైస్‌ప్రెసిడెంట్ పివి మోహన్ రామిరెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ సంతోష్ సతీసమేతంగా పాల్గొని ఫౌండర్స్ డే విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీనివాస్ వందన సమర్పణతో ముగిసిన ఈ సంబరంలో తడ సర్పంచ్ శశి కుమార్‌తో పాటు గ్రామపెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



యాజమాన్యం తరపున బొకేను స్వీకరిస్తున్న కార్మిక నాయకులు



### సంస్థ క్షేమమే కార్మికుల సంక్షేమం



శంకరరెడ్డి

సంస్థ డైరెక్టర్ శంకరరెడ్డి మాట్లాడుతూ సంస్థ క్షేమంగా ఉన్నప్పుడే కార్మికుల సంక్షేమం సాధ్యమవుతుందని. కరోనా కష్టకాలంలో సైతం ఇతర సంస్థలకంటే ధీటుగా బ్యాటరీల ఉత్పత్తిలో నిప్పో సంస్థ ముందుండడం గమనార్హం అన్నారు. అంకిత భావంతో, క్రమశిక్షణతో పాటు సమయపాలన కూడా చాలా అవసరమని కార్మికులకు హితబోధ చేశారు. ఓబుళరెడ్డితో తనకు సుదీర్ఘ అనుబంధముందని, ఎంతో ముందుచూపు, ఆధునిక భావాలు కలిగిన ఆ తరం పెద్దాయన ఓబుళరెడ్డి అని, అలాంటి వ్యక్తి సంస్థలో పనిచేయడం అదృష్టమైతే, ఆయనతో అత్యంత సన్నిహితంగా మెలిగే అవకాశం రావడం వరమని శంకరరెడ్డి చెప్పారు. ఓబుళరెడ్డి ఆశయ సాధనలో యాజమాన్యం నిత్యం కృషి చేస్తోందని, కార్మికులు సైతం తమ సహాయ సహకారాలు అందించి వ్యవస్థాపకుని ఆశయాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

### పారిశ్రామిక అభివృద్ధికి పునాది వేసిన తొలి వ్యక్తి ఓబుళరెడ్డి



శివప్రభాత్‌రెడ్డి

'లాయర్' పత్రిక సంపాదకులు ప్రభు మాట్లాడుతూ... జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి పునాది వేసిన తొలి వ్యక్తిగా ఓబుళరెడ్డిని కీర్తించారు. నెల్లూరుజిల్లాకి చెందిన ఎంతోమంది ప్రముఖులు తమ జిల్లాని వదిలి హైదరాబాదు, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలలో తమ వ్యాపారాలను విస్తరించుకుంటే, కడపజిల్లాకు చెందిన ఓబుళరెడ్డి నెల్లూరు జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి ప్రాణప్రతిష్ట చేశారన్నారు. నిప్పో బ్యాటరీల తయారీ ద్వారా నెల్లూరుజిల్లాని అంతర్జాతీయ వాణిజ్య పటంలో నిలపడమే కాకుండా, భారతదేశమంతా ప్రాచుర్యాన్ని పొందిన నిప్పో బ్యాటరీల ద్వారా నెల్లూరుకు కూడా గుర్తింపును తెచ్చారని అన్నారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతమైన తడలో వేల ఎకరాలలో శ్రీసిటీ గత పదిహేనేళ్ళుగా అభివృద్ధి చెందిందని, అపాచీ బూట్ల ఫ్యాక్టరీ ఇక్కడే ఆవిర్భవించిందని, అదే తడ ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను 40 ఏళ్ళ నాడే ఓబుళరెడ్డి గుర్తించారని ప్రభు చెప్పారు. మౌలిక వసతులు ఉన్న చోటుకి మనం వెళ్లకూడదని, మనం వెళ్ళిన చోట వాటిని కల్పించాలన్నది ఓబుళరెడ్డి సిద్ధాంతంగా పెట్టుకుని తమ సంస్థలను స్థాపించారని అన్నారు. ఆయన జీవన ప్రయాణంలో ప్రారంభించిన పలు వ్యాపారాలను, సాధించిన విజయాలను గురించి ప్రభు వివరించారు. పారిశ్రామిక రంగంతో పాటు, ఆధ్యాత్మిక, సేవ, సామాజిక రంగాలలో సైతం ఓబుళరెడ్డి అందించిన సేవలను ఈ సందర్భంగా శివప్రభాత్‌రెడ్డి గుర్తు చేశారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఓబుళరెడ్డి పనిచేసేవారని, వారి వారసులు సైతం అదే సిద్ధాంతంతో కార్మికులు, వారి కుటుంబసభ్యుల అవసరాలను తీరుస్తూ సంస్థను ప్రగతి బాటలో నడిపించడం అభినందనీయమని అన్నారు. సంస్థ వార్షికోత్సవానికి బదులుగా ఓబుళరెడ్డి జన్మదినాన్ని 'ఫౌండర్స్ డే'గా జరుపుకోవడం మంచి సంప్రదాయమని, ఈ ఆనవాయితీ ఇలాగే కొనసాగాలని ప్రభు ఆకాంక్షించారు. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డికి ఓబుళరెడ్డికి ఉన్న స్నేహ బంధం, ఆ తరువాతి కాలంలో తనకున్న ఆత్మీయ బంధాన్ని ఈ సందర్భంగా ప్రభు గుర్తు చేసుకున్నారు.

# వీఎస్‌యులో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న వీఎస్‌యు వీసీ సుందరవల్లి, ఎన్ఎస్ఎస్ సభ్యులు

'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమంలో భాగంగా నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో ఈనెల 21న వనమహోత్సవం ప్రారంభించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వీఎస్‌యులో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జి.ఎం సుందరవల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా 'మేక్ ది వరల్డ్ గ్రీన్' అనే నినాదంతో జిల్లా వ్యాప్తంగా అన్ని అనుబంధ కళాశాలల్లోని జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఏ ఒక్కరోజుకో పరిమితం చేయకుండా రాబోయే రోజులలో నెల్లూరును పచ్చదనంతో నింపాలని, సామాజిక అటవీశాఖ వారి సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని, జిల్లా వ్యాప్తంగా ఒక ఉద్యమంలాగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. కాలుష్య నివారణకు, పర్యావరణ సమతుల్యతకు చెట్లు పెంచడం ఎంతో అవసరమని చెప్పారు. ప్రజలందరు కూడా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తే అవే మన భావితరాలకు మనమిచ్చే గొప్ప సంపద అని అన్నారు. ప్రకృతి పచ్చగా ఉంటే మంచి ప్రాణవాయువు లభిస్తుందని తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుందని వీఎస్‌యు రెక్టార్ ఆచార్య ఎం.చంద్రయ్య అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపాల్స్‌కు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులకు రిజిస్ట్రార్ డా. ఎల్. విజయకృష్ణారెడ్డి అభినందనలు తెలియచేశారు. ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి డా. ఉదయ్‌శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. ఆర్.ప్రభాకర్, డా.వై.విజయ, డీన్ డా.విజయ ఆనంద కుమార్‌బాబు, డెప్యూటీ రిజిస్ట్రార్ డా. సాయిప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డా. సుజయ్, అధ్యాపకులు డా. టి.వీరారెడ్డి, డా. సిహెచ్ విజయ, డా. సునీత, డా. హనుమారెడ్డి, డా. వెంకట్రాయులు, డా. ఆర్.మధుమతి, డా. సి.కిరణ్మయి, డా. బివి సుబ్బారెడ్డి, పిఆర్‌ఓ డా. కోట నీలమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# కీర్తికి వీఎస్‌యు డాక్టరేట్



కీర్తిని అభినందిస్తున్న వీఎస్‌యు విసి సుందరవల్లి

కోవూరుకు చెందిన పాటూరు కీర్తికి విక్రమసింహపురి యూనివర్శిటీ ఇటీవల డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. టూరిజం విభాగం అధిపతి డాక్టర్ మైలా త్యాగరాజు పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ టూరిజం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్ ది న్యూలీ ఫార్మ్‌డ్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై కీర్తి పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు వీఎస్‌యు డాక్టరేట్‌ను బహుకరించింది. ఈ సందర్భంగా కీర్తిని వీఎస్‌యు వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డా.ఎల్వి కృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

### వచ్చే ఏడాది సెప్టెంబరు దాకా..

# కంటివెలుగు

**- డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి**

డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమాన్ని వచ్చే ఏడాది సెప్టెంబరు దాకా ప్రభుత్వం పొడిగించిందని, వృద్ధులు, పేదలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి చెప్పారు. ఇటీవల ఆమె సంబంధిత నేత్రవైద్య అధికారులతో మాట్లాడుతూ తగు సూచనలు చేశారు. ప్రతి మండల కేంద్రంలో వృద్ధులకు నేత్రవైద్యానికి సంబంధించిన వైద్యపరీక్షలు చేస్తారని, మందులు, కంటిఅద్దాలు, అవసరమైన వారికి నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రిలో. ఏరియా ఆసుపత్రితో పాటు నారాయణ, జయభారత్, ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రుల్లో కూడా కంటి శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి, ప్రముఖ నేత్రవైద్యురాలు డాక్టర్ మంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

### ఓటిఎస్ పథకం..

# పేదలకు వరం

**- మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్**

ప్రభుత్వం అమలుచేస్తున్న ఓటిఎస్ (ఒన్ టైమ్ సెటిల్‌మెంట్) పథకం పేదలకు, మధ్యతరగతి ప్రజలకు వరమని, లబ్ధిదారులకు అతితక్కువ మొత్తంతో స్థిరాస్తిపై ప్రభుత్వం హక్కులను కల్పిస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల శ్రేయస్సు కోసం 'జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకాన్ని' ప్రారంభించారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ చెప్పారు. ఈనెల 21న ఆయన నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 1983 నుంచి 2011 వరకు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకున్న పేదలు సకాలంలో తీర్చలేక అనేకమంది తమ ఇంటి పత్రాలను హౌసింగ్ కార్పొరేషన్‌లో తనఖా పెట్టారని, ఆ అప్పు, వడ్డీ కలిసి పెద్దమొత్తం అయిందని, పైగా ఆ ఇళ్ళపై వారికి ఎలాంటి హక్కులు లేవని, ఈ నేపథ్యంలో ఓటిఎస్ ద్వారా అతితక్కువ మొత్తంతోనే వారికి ప్రభుత్వం బకాయిలు రద్దు చేయడమే కాక, ఉచితగా స్థానిక సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ చేయిస్తోందని వివరించారు. దీంతో గ్రామాల్లో సుమారు ఏడెనిమిది లక్షలు, పట్టణాల్లో 14 లక్షల దాకా విలువైన స్థలాలపై లబ్ధిదారులకు సంపూర్ణ గృహహక్కు ఏర్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జడ్పీ ఛైర్మెన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జేసీలు హరేందిరప్రసాద్, విదేహ్‌ఖరే తదితరులు పాల్గొన్నారు.

# రామానుజం సేవలు.. అమోఘం

**'విశ్వసాయి' ఆధ్వర్యంలో 130వ జయంతి**



రామానుజం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ

ప్రఖ్యాత గణిత శాస్త్ర పితామహుడు ఆచార్య శ్రీనివాస రామానుజం 134వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి జూనియర్ కాలేజీలో జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ, వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌లు పాల్గొని శ్రీనివాస రామానుజం చిత్రానికి పూలమాలలు వేసి ఆ మహనీయుని సేవలను స్మరించుకున్నారు. అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నతమైన గణితశాస్త్ర సిద్ధాంతాలను ఆవిష్కరించి ఆయన భవిష్యత్ తరాలవారికి మార్గదర్శకంగా నిలిచారని, గణితశాస్త్రంలో ఆయన చేసిన అపూర్వమైన సేవలను వారు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులంతా ఆ మహనీయుని స్ఫూర్తిగా తీసుకుని రాణించి సమాజానికి మార్గదర్శులుగా నిలవాలన్నారు.

# బుద్ధిగా నడుచుకోకుంటే.. జైలుకే!

**- రౌడీషీటర్లకు సంతపేట ఇన్‌స్పెక్టర్ వార్నింగ్**



'బుద్ధిగా నడచుకోండి.. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలకు, రౌడీయిజానికి పాల్పడితే జైలు తప్పదు'.. అంటూ నెల్లూరులోని సంతపేట పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ షేక్ అన్వర్‌బాషా రౌడీషీటర్లకు వార్నింగ్ ఇచ్చారు. సంతపేట పరిధిలోని రౌడీషీటర్లను, అనుమానాస్పద వ్యక్తులను ఆయన ఈనెల 19న స్టేషన్‌కు పిలిపించుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకుని మంచిమార్గంలో నడవకపోతే కేసులు తప్పవన్నారు. దురలవాట్లను మానుకుని గౌరవంగా పనులు చేసుకుంటూ, తమను నమ్ముకున్న కుటుంబసభ్యులను ఇబ్బందులకు గురిచేయకుండా వారితో కలిసి ఆనందంగా జీవించాలని హితవు పలికారు. సత్ప్రవర్తనతో మెలిగితే పరిశీలించి వారిపై ఉన్న రౌడీషీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని చెప్పారు. ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో..

# యూనివర్శిటీ టాపర్లుగా 'కృష్ణచైతన్య' విద్యార్థులు



ఇటీవల విక్రమసింహపురి యూనివర్శిటీ విడుదల చేసిన డిగ్రీ తొలి సెమిస్టర్ ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించారు. తమ విద్యార్థులు యూనివర్శిటీ టాపర్లుగా నిలిచారంటూ ఆ కళాశాల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు సంతోషం వ్యక్తం చేశారు. బిఎస్సీలో మనీషా 99 శాతం, ఎస్‌కె రోహిత్, ఎం.స్రవంతి 98.8 శాతం, పి.సుజిత, ఎన్.సుజిత, వి.మధులత, పి.రితిక 98.5 శాతం, ఎం.డి అంజుమ్‌షిఫా, ఎస్‌డి ఆస్మా సుల్తానా 98 శాతం మార్కులు సాధించారన్నారు. అదేవిధంగా బిఎస్సీ లైఫ్‌సైన్స్‌లో కె.ఊహాలిఖిత, షేక్ షహనాజ్‌లు 97 శాతం, ఎన్ కీర్తి 96, టి.లావణ్య 95.5 శాతం సాధించారని, బిసిఏలో పి.కావ్య 99.5 శాతం, వి.నందిని 99, పి.అజయ్‌కుమార్, కె.సహన, ఎస్‌కె సబ్బా, ఎస్‌డి అమీరా 98.7 శాతం, బిబిఏలో ఆర్ ఆమీషారావ్ 98 శాతం, ఎం.శ్రీలేఖ 97, పి.వసంతలక్ష్మి 95శాతం, బికాంలో ఎస్‌కె సోఫియా 96 శాతం, ఆర్ అరుణ 95, జె.శ్రీజ 94 శాతం మార్కులతో రాణించారని తెలిపారు. ఎప్పటికప్పుడు సాంకేతికపరమైన అంశాలను విద్యార్థులకు విశదీకరిస్తూ నిరంతర పర్యవేక్షణతో ఇంతటి ఘన విజయాన్ని సాధించగలిగామని వారు పేర్కొన్నారు. విద్యార్థులంతా అత్యధికశాతం మార్కులు సాధించి కళాశాలకు మంచిపేరు తెచ్చారని వారు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్ ఎస్.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

### భక్తిపాటలతో వీనులవిందుగా..

# క్రీస్తు గాన జయంతి



క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని విఆర్‌సి సెంటర్‌లో ఉన్న బాప్టిస్టు చర్చి డౌనీహాల్ ఈనెల 19న భక్తిపాటలతో.. వీనులవిందైన సంగీతంతో ఆకట్టుకుంది. అత్యద్భుతమైన రీతిలో 'క్రీస్తు గాన జయంతి'ని నిర్వహించి చర్చి నిర్వాహకులు అందరినీ భక్తిభావంలో ఆనందపరవశుల్ని చేశారు. క్రీస్తు జనన సందేశాన్ని పాటల ద్వారా సంగీతరూపకంగా రూపొందించి చేపట్టిన ఈ కార్యక్రమం అద్యంతం ఎంతో వేడుకగా జరిగింది. క్రిస్టఫర్, గంటా రచనలకు గుర్రం సుధాకర్ రావు, జమ్ముల జయకుమార్, అరుణ్‌కుమార్, బిల్లీ శ్యాంసన్‌లు స్వరకల్పన చేశారు. ఎంతో భక్తితో, సుమధుర స్వరంతో గాయకులు ఈ గీతాలను ఆలపించి తమ భక్తిని చాటుకున్నారు. సురేష్, శాంతి, విక్రం, జోయల్ శ్యాం, గిరి ఆ గీతాలకు వాద్యసహకారం అందించారు. మంచి పాటలు, మాటలతో దైవారాధకుల భక్తి సందేశా లతో ఈ కార్యక్రమం భక్తులను అలరించింది. కావలికి చెందిన తెలుగు బాప్టిస్టు చర్చి రెవరెండ్ గంటా కరుణాసాగర్ పాల్గొని వాక్యోపదేశం చేశారు. ఛైర్మెన్ సురేంద్రబాబు, కోశాధికారి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత సంఘకాపరి రెవరెండ్ గంగవరపు మనోహర్ మృతికి సంతాపం ప్రకటించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

# లోన్‌స్టార్ చర్చిలో.. పేదలకు దుప్పట్లు పంపిణీ



క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు సుబేదారుపేటలో ఉన్న లోన్‌స్టార్ తెలుగు బాప్టిస్టు చర్చిలో ఈనెల 20న పేదలకు దుప్పట్లు, వస్త్రాలను పంపిణీ చేశారు. క్రీస్తు సంఘీయులు కాకాని చిన్నారావు, డాక్టర్ హిమదేవి, జి.ప్రభుదాస్, లలితాబాయి సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు.

☞ జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ - వైకాపా నేత ఆనం విజయకుమార్‌రెడ్డి దంపతులను వారి స్వగృహంలో కలిసి 'విజయ పథంలో నెల్లూరీయులు', 'సింహపురికి వన్నెతెచ్చిన వనితలు' కాఫీ టేబుల్ పుస్తకాలను అందజేస్తున్న శివప్రభాత్‌రెడ్డి (ప్రభు) - భారతిరెడ్డి దంపతులు.

☞ కమ్యూనిటి డెవలప్‌మెంట్ కమిటీ చైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను వారి వారి స్వగృహాలలో కలసి 'విజయపథంలో నెల్లూరీయులు' కాఫీ టేబుల్ పుస్తకాన్ని అందజేస్తున్న శివప్రభాత్ రెడ్డి (ప్రభు).







# కోవిడ్ వ్యాక్సిన్‌పై... పార్లమెంట్‌లో సుదీర్ఘ చర్చ



## ప్రశ్నల వర్షం కురిపించిన ఎంపీ వేమిరెడ్డి

పార్లమెంట్‌లో ఈనెల 21 కోవిడ్ వ్యాక్సిన్‌పై, దాని ధరలపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. ఈ చర్చలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆ విషయాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. జైడస్ క్యాడిలా కంపెనీ తన కోవిడ్ వ్యాక్సిన్ ధరను ఒక్కో మోతాదుకు 265 రూపాయలు తగ్గించడానికి అంగీకరించడం వాస్తవమేనా?. అయితే ఆ వివరాలు తెలపండని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా ఎక్కువ మందికి వ్యాక్సినేషన్ అందించే కార్యక్రమంలో భాగంగా జైడస్ క్యాడిలా యొక్క జైకోవ్-డి టీకా ఎంతవరకు సహాయపడుతుంది?.. 12 సంవత్సరాల వయసుకంటే ఎక్కువ వయసున్న పిల్లలకు ఈ టీకా అనుమతించబడుతుందా?.. ఈ డిఎన్ఏ వ్యాక్సిన్‌ను ఫార్మాజెట్‌తో నిర్వహించబోతున్నారా?.. అయితే ఆ వివరాలేమిటి?.. దేశంలో ఇప్పటికే ఉన్న, ప్రతిపాదించిన టీకాల ప్రభావం ఒమిక్రాన్‌పై ఏవిధంగా ఉంటుంది?.. అని ఆయన ప్రశ్నిస్తూ ఆ వివరాలన్నీ లిఖితపూర్వకంగా తెలపాలని కోరారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి డా. భారతిప్రవీణ్ సమాధానమిస్తూ 12 ఏళ్ళు ఆపై వయసున్న వారికి జైకోవ్-డి వ్యాక్సిన్ అత్యవసర సమయంలో పరిమిత ఉపయోగం కోసం డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా వారి నేషనల్ రెగ్యులేటర్ ఆమోదం పొందిందని, దీనిని ఇంట్రాడెర్మల్ వ్యాక్సిన్ డెలివరీని నిర్ధారించే సూదితో కాకుండా అప్లికేటర్ ఉపయోగించి నిర్వహించాలని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్ అనే ప్రొక్యూర్‌మెంట్ ఏజెన్సీ ద్వారా జైడస్ క్యాడిలా నుండి జైకోవ్-డి వ్యాక్సిన్‌ను ఒక్కో మోతాదుకు 358 రూపాయల వంతున ఆర్డర్ చేసిందని పేర్కొంటూ ఇందులో ఒక్కో మోతాదు టీకా ధర 265 రూపాయలు, డిస్పోజబుల్ మరియు సూది లేకుండా అప్లికేటర్ ధర 93 రూపాయలు కలిపి ఉంటుందని వివరించారు. దీంతో జాతీయస్థాయి కోవిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో అందుబాటులో ఉన్న వ్యాక్సిన్‌ల సంఖ్య పెరుగుతుందన్నారు. ఒమిక్రాన్ వేరియంట్ ప్రభావం గురించి సాంకేతిక బృందాలతో పరిశీలించడం జరిగిందన్నారు. అయితే, జాతీయ కోవిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ప్రస్తుతం వాడబడుతున్న వ్యాక్సిన్‌లు కోవిడ్-19 కారణంగా వచ్చే తీవ్రమైన వ్యాధి ప్రమాదాన్ని నివారించడానికి ప్రభావవంతగా ఉంటాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

# వరద బాధితులకు అండగా ప్రభుత్వం

- 30 కోట్ల ఎఫ్‌డిఆర్ నిధులు మంజూరు
- మరమ్మతులను వెంటనే పూర్తిచేయాలి

**- మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే ప్రసన్న**



కోవూరు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇటీవల భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న చెరువులు, కాలువలు, రోడ్ల మరమ్మత్తులకు కోవూరు నియోజకవర్గానికి ప్రభుత్వం 30.08 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని, ఆ నిధులతో వెంటనే మరమ్మతు కార్యక్రమాలు చేపట్టాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 20న కోవూరులో జరిగిన మండల ప్రజాపరిషత్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆ పనులకు త్వరిత గతిన టెండర్లు పిలిచి ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. వరదలకు నారుమళ్ళు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేసిందని, వరికోత యంత్రాలను రాయితీతో అందజేస్తోందని, పాడిరైతులకు ఆసరాగా మూగ జీవాల కోసం ఉచితంగా దాణా కేటాయించిందని ఆయన వివరించారు. ఎంపిపి పార్వతి అధ్యక్షతన సమావేశం జరిగింది. గంగవరం ఎంపిటిసి సభ్యురాలిగా కొత్తగా ఎన్నికైన సుమిత్రమ్మను ఈ సందర్భంగా ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే నేతాజీనగర్‌కు వెళ్ళి వరదలతో నష్టపోయిన 18 మంది పేదలకు ఇళ్ళ పట్టాలు పంపిణీచేశారు. డిఏఏబి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, డిసిఎమ్ఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, జడ్పీటిసి సభ్యురాలు శ్రీలత, పడుగుపాడు సొసైటీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, నాయకులు నలుబోలు సుబ్బారెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, డిఆర్‌డిఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, తహశీల్దార్ సుబ్బయ్య, ఎంపిడిఓ శ్రీహరి పాల్గొన్నారు.

## ఇళ్లపై పేదలకు హక్కులు కల్పించాలన్నదే..

# జగనన్న ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



నాయుడుపేటలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

పేదలకు ఇళ్లపై సంపూర్ణ హక్కులు కల్పించాలన్నదే జగనన్న ధ్యేయమని, పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో అనేక పథకాలు చేపట్టి అమలుచేస్తున్నారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్య చెప్పారు. ఇటీవల ఆయన నాయుడుపేటలో జేసీ హరేందిరప్రసాద్, ఆర్డీఓ సరోజినిలతో కలసి ఓటిఎస్ పథకం తీరుతెన్నులను సమీక్షించారు. హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రుణాలు స్వీకరించి ఇళ్ళు నిర్మించుకున్న లబ్దిదారులకు ఆ ఇళ్లపై సర్వహక్కులు కల్పించేలా రాష్ట్రప్రభుత్వం జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం కింద రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలను అందజేస్తోందని, ఈ పథకంపై లేనిపోని అపోహలు పెట్టుకోకుండా పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు వారికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ పథకం అమలులో సూళ్ళూరుపేట నియోజకవర్గాన్ని జిల్లాలో ప్రథమస్థానంలో ఉండేలా పటిష్టంగా అమలుచేయాలని కోరారు. జేసీ హరేందిరప్రసాద్ మాట్లాడుతూ ఈ పథకానికి సంబంధించిన నగదు చెల్లించిన ప్రతి లబ్దిదారుడికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సచివాలయాల్లో సిద్ధం చేయాలన్నారు.

## గ్రామాల్లో అక్షరాస్యతను పెంపొందించాలి

**- జిల్లా కో-ఆర్డినేటర్**

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యతను బాగా పెంపొందించాలని, ప్రతిఒక్కరూ సేవాభావంతో అక్షరాస్యతను పెంచేందుకు కృషి చేయాలని అక్షరాస్యత జిల్లా కోఆర్డినేటర్ రామ్మోహన్‌రావు కోరారు. ఈనెల 19న ఆయన వరికుంటపాడులోని జడ్పీహైస్కూల్‌లో అక్షరవెలుగు ప్రాజెక్టు ఆధ్వర్యంలో గ్రామ సమన్వయ కర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి అందరూ చదువుకునేలా చూడాలన్నారు. మండల కోఆర్డినేటర్లు హరిబాబు, శివ నందిని తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు

# పుస్తకాలు పంపిణీ చేసిన.. శ్రీసిటీ ఫౌండేషన్



పుస్తకాలను పంపిణీ చేస్తున్న శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు

శ్రీసిటీ ఫౌండేషన్ తన వితరణగా శ్రీసిటీ పరిధిలోని 5 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు 25 వేల రూపాయల విలువ కలిగిన లైబ్రరీ పుస్తకాలను ఈనెల 21న పంపిణీ చేసింది. పెద్ద ఈటి పాక్కం, పెద్ద ఈటిపాక్కం దళితవాడ, కొల్లడం, రాళ్లకుప్పం, గొల్లపాలెం పాఠశాలలకు ఒక్కో స్కూల్‌కు 70నుంచి 80 పుస్తకాల వంతున ప్రధానోపాధ్యాయులకు అందచేశారు. చిన్నవయస్సు నుంచే పిల్లలలో పఠనాసక్తిని పెంచేందుకు, మొబైల్ ఫోన్లు, టీవీల వీక్షణకు బదులుగా పుస్తకాలు చదివే అలవాటును ప్రోత్సహించే ఉద్దేశంతో పుస్తకాలను పంపిణీచేశామని శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. గతంలోను శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా సుమారు 3 లక్షల రూపాయల విలువైన లైబ్రరీ పుస్తకాలను శ్రీసిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. కాగా, పుస్తకాల వితరణ పట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.







## కళ్యాణ వైభవం...!

లోకేష్ - కళ్యాణి




గూడూరు వాస్తవ్యులు బండి శ్యామసుందరరావు (మయూరి శ్యాంయాదవ్) - మహేశ్వరిల కుమారుడు **లోకేష్ - కళ్యాణి**ల కల్యాణం డిసెంబర్ 19వ తేదీ తిరుమలలో, రిసెప్షన్ గూడూరులో వైభవంగా జరిగాయి. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## ఎమ్మెల్యే ప్రసన్న రక్తదానం



కోవూరు నియోజకవర్గం, ఇందుకూరుపేట మండలంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసిన అనంతరం రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

## సిఎం పుట్టినరోజున.. ఎన్‌బికెఆర్‌లో మొక్కలు నాటిన విద్యార్థులు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 21న కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. తొలుత కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి మొక్కను నాటి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఉదయకుమార్‌రాజు, ఎన్‌సిసి నావెల్ యూనిట్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఇదే 2024 ఎన్నికల అంశం!

మన దేశంలో సార్వత్రిక ఎన్నికలలో గెలవడం .., లేదా ఓడడంలో 'ఎమోషనల్' ఇష్యూలు గణనీయమైన పాత్ర పోషిస్తాయి. ఏదైనా ఒక అంశం మీద ఓటర్ల భావోద్వేగాలను కేంద్రీకృతం చేయగలిగితే సగం విజయం సాధించగలిగినట్టే! 2014లో నరేంద్రమోదీ 56 అంగుళాల ఛాతిపై ప్రజల దృష్టి కేంద్రీకృతమయ్యేటట్టు బీజేపీ చేయగలిగింది. అందువల్లనే, కార్గిల్ యుద్ధంలో ఘన విజయం తరువాత సైతం వాజపేయి లాంటి గొప్ప నాయకుడికి లభించని మెజారిటీ కూడా మోదీకి లభించింది. ఇప్పుడు మూడోసారి గెలవడానికి బీజేపీ అయోధ్య, కాశి, గంగా నది, హిందూత్వ వాదం, మెగా అభివృద్ధి ప్రాజెక్ట్ లపై ఆధారపడుతున్నది.

అయితే, ఒక ఎమోషనల్ ఇష్యూని వెదికి పట్టుకోవడం అంత సులభమైన విషయం కాదు. గడ్డివాములో సూదిని వెదికి పట్టుకోవడం లాంటిది.

2019 ఎన్నికల కోసం ఏ భావోద్వేగ అంశం దొరుకు తుందా అని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్రంగా ఆలోచించారు. పోలవరం ప్రాజెక్ట్ అంశాన్ని ఎమోషనల్ ఇష్యూగా మారుద్దామని కొందరు టీడీపీ పెద్దలు భావించారు గానీ, ఈ టాపిక్‌లో అంత బలం లేదనే భావం వ్యక్తమైంది. దాంతో, అది పక్కకు వెళ్ళింది. తరువాత, 'ప్రత్యేకహోదా' అంశాన్ని బయటకు తీశారు. దీనిని ఒక భావోద్వేగ అంశంగా మార్చడం ద్వారా... ఎన్నికల గోదారిని దాటవచ్చని టీడీపీ పెద్దలు భావించారు. దాంతో, ప్రధానిపై భీకర వాగ్దాడులు, ఆయనను కించపరచ డాలు, కేంద్రంపై విమర్శలు, నల్ల బ్యాడ్జీలు, జిల్లా జిల్లాకు ధర్మాగ్రహ సభలు, 'ఢిల్లీ'లోనూ నిరసన సభలు.



మనలో మాట 49

ధర్మాగ్రహ సభలు సూపర్ సక్సెస్. జనాలతో కిటకిట. ఆ సక్సెస్ అన్నది బిర్యానీ, క్వార్టర్ బాటిల్‌లో ఉంది. కానీ, అదంతా స్పెషల్ స్టేటస్‌పై ప్రజలలో వ్యక్తమవు తున్న భావోద్వేగం అని టీడీపీ పెద్దలు అనుకున్నారు. అది వర్క్ ఔట్ కాలేదు. కాకపోగా అది ఎంత ఖరీదైన తప్పిదమో చంద్రబాబునాయుడికి ప్రాక్టికల్‌గా తెలిసి వస్తున్నది. ఈ ఆలోచన భావోద్వేగ అంశం కాకపోవడానికి ప్రధాన కారణం తెలుగు దేశమే. ప్రజలకూ పట్టలేదు, రాజకీయపార్టీలకూ పట్టలేదు. అందువల్ల ఆ వ్యూహం సూపర్ ప్లాప్ అయింది.

ఇక ఇప్పుడు వర్తమానంకు వస్తే 2024 సార్వత్రిక ఎన్నికలకు 'అమరావతి' ఎమోషనల్ ఇష్యూ అయ్యే అవకాశాలు ఎక్కువగా కనపడుతున్నాయి. అమరావతి ఒక్కటే రాష్ట్ర రాజధానిగా ఉండాలని వైసీపీయేతర రాజకీయ పక్షాలు, మూడు రాజ ధానులు ఉండాల్సిందే అని వైసీపీ పట్టుబట్టి కూర్చున్నాయి. ఈ అంశమే ఉప్పు, నిప్పు లాంటి రాజకీయపార్టీలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నది . అంటే అమరావతికి అనుకూలంగా వైసీపీయేతర పార్టీలు, మూడు రాజధానులకు అనుకూలంగా వైసీపీ పరస్పరం మోహరిస్తున్నాయి. ఈ అంశం రాష్ట్ర ఓటర్లను నిలువునా విభజించడం ఖాయం. ఎందుకంటే అమరావతికి అనుకూల..., వ్యతిరేక శిబిరాలు రెండూ బలంగానే ఉన్నాయి. ఎన్నికల మానిఫెస్టోలో కూడా ఈ అంశానికి ప్రముఖ స్థానం లభించే అవకాశం లేకపోలేదు. మమ్మల్ని గెలిపిస్తే... మూడు రాజధానులు అని వైసీపీ, మమ్మల్ని గెలిపిస్తే అమరావతి రాజధాని అని టీడీపీ కూటమి ప్రజలకు హామీ ఇవ్వవచ్చు .

ఫలితంగా.. ఈ అంశం 2024 ఎన్నికలను తీవ్రంగా ప్రభావితం చేయడం తథ్యం. అందుకే, ఈ రాజధాని అంశం 2024 ఎన్నికల ఇష్యూ కాబోతోందనే భావన కలుగుతోంది. అయితే, ఎన్నికలు ఇప్పుడు లేవు. ఇంకా రెండేళ్ల తరువాత మాత్రమే ఉన్నాయి. ఈ వ్యవధిలో సవాలక్ష మార్పులు చోటు చేసుకోవచ్చు. అనుకోని ఘటనలు జరగవచ్చు. సమీకరణాలు మారవచ్చు. ఇవేమీ లేవు అని అనుకుంటే రాజధానిని భావోద్వేగ సమస్యగా మార్చడంలో టీడీపీ కూటమికి మరో అంశం కూడా కలిసివస్తుంది. అదే రాజధాని రైతుల ఉద్యమం. వచ్చే ఎన్నికల వరకు తమ ఉద్యమాన్ని కొనసాగించాలనే పట్టుదలతో ఉన్నారు. వారికి అర్థబలంకు లోటు లేదని 45 రోజుల పాదయాత్ర జరిగిన తీరుతో పాటు తిరుపతి బహిరంగ సభ ఏర్పాట్లు జరిగిన తీరు చూసినవారికి అర్థం అవుతుంది. భవిష్యత్‌లో కూడా డబ్బుకు ఇబ్బంది ఉండదు. వీరిని ముందు పెట్టుకుని చంద్రబాబు నాయుడు జగన్‌తో పోరాటానికి సిద్ధం అవుతున్నారు. ఇందులో సందేహం లేదు. 2024 ఎన్నికలే ఆయనకు చివరి అవకాశం. నౌ ఆర్ నెవెర్.

అందుకే, ఇప్పుడు రాయలసీమకు పాదయాత్ర చేసిన రైతులు వచ్చే రెండేళ్ళలో ఇటువంటి కార్యక్రమాలతో రాజధాని అంశాన్ని సజీవంగా ఉంచుతారు. ఎన్నికల్లో రైతు ముఖ్యులకు టీడీపీ టిక్కెట్లు కూడా లభించవచ్చు. రెండో పక్క కూడా మూడు రాజధానులపై వైసీపీ పట్టు బిగిస్తున్నది.

అసలు, శాసనసభను రద్దుచేసి, మూడు రాజధానులను ఏర్పాటు చేస్తాం... ఆశీర్వదించండి అనే ఏకవాక్య ఎజెండాతో వైసీపీ గనుక ఎన్నికలకు వెడితే... చాలా అంశాలు కాలగర్భంలో కలిసిపోతాయి.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

## గూడూరు డివిజన్ వార్తలు



పొనకా దేవసేనమ్మ - శివకుమార్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం...

### జననేత జన్మదినాన...

## వెల్లువలా సేవా కార్యక్రమాలు

ప్రజానేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న ఆయన అభిమానులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు గూడూరులో వెల్లువలా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ–పారిశ్రామికవేత్త పొనకా శివకుమార్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో భారీగా రక్తదానం, అన్నదానం, మొక్కలు నాటే కార్యక్రమం, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. ఈ సేవా కార్యక్రమాల్లో గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, కనుమూరి హరిశ్చంద్రారెడ్డి, మేరిగ మురళీ, ఎస్.వి.రత్నం చారిటీస్ వ్యవస్థాపకులు, ప్రముఖ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, బత్తిని విజయకుమార్, గోపాల్ యాదవ్, బి.రమేష్, బొమ్మిడి శ్రీనివాసులు, నాసిన నాగులు, కోదండయ్య, కోడిపర్తి శ్రీధర్, కల్పన, షంషేర్, ముని, సాయి తదితరులు పాల్గొన్నారు. పేర్నాటి శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో చిల్లకూరులోని అనాధాశ్రమంలో(డానియల్ చిల్డ్రన్స్ హోమ్)లో భారీ కేక్‌ను కట్ చేసి, పిల్లలకు నోట్‌బుక్స్ అందించారు. అనంతరం పిల్లలతో కలిసి ఆయన అల్పాహారాన్ని భుజించారు. కోడూరు మీరారెడ్డి ఆధ్వర్యంలో 49కేజీల కేక్‌ను కట్ చేసి పేదలకు పంచిపెట్టారు. అనంతరం గూడూరు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే కోటలో నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. సాయిబాబా ఆలయంలో అన్నదానం నిర్వహించారు. తొలుత వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ...



కోడూరు మీరా రెడ్డి ఆధ్వర్యంలో 49 కేజీల భారీ కేక్...



వైయస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి

# ఉత్తమ పాస్టర్లకు సన్మానం



సమాజానికి ఉత్తమ సేవలందించిన పాస్టర్లను సత్కరించిన పాస్టర్స్ సంక్షేమ సంఘం నిర్వాహకులు

సమాజానికి ఉత్తమ సేవలందిస్తున్న పదిమంది పాస్టర్లను ఈ నెల 20న నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలో సన్మానించారు. పాస్టర్స్ సంక్షేమ సంఘం 5వ వార్షికోత్సవం సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాస్టర్ల సేవలను అందరూ కొనియాడారు. రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డిఐజి అబ్రహాం ముఖ్యఅతిథిగా పాల్గొని గత అయిదేళ్ళుగా సామాజిక సేవ చేస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. పాస్టర్లను శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఉషా కిరణ్‌రాయ్, పలు క్రైస్తవసంఘాల ప్రముఖులు డేవిడ్ దయాసాగర్, ఎలీషాకుమార్, బర్నాబాస్, రాజారెడ్డి, ఏ.జయప్రకాష్, గడ్డం హనోక్, మోసెస్ రాఘవ, కెఎస్ రాజ, శ్యామ్, సదాశివరావు, రమేష్, జాషువా, కిషోర్, జోసఫ్ డేవిడ్, శ్యాం పాల్గొన్నారు. తొలుత కేకు కట్ చేసి కొత్తసంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

# రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఏదీ?..

## - ఏపిఎస్‌యు నాయకుల ప్రశ్న




రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయం ఏమైందని ఏపి ఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నించారు. ఈనెల 19న నెల్లూరులో ఆ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయవర్ధన్ మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా ప్రత్యేకహోదాతో పాటు రాష్ట్రానికి అనేక హామీలిచ్చిన జాతీయపార్టీలు ఇప్పుడు వాటన్నిటినీ మరచిపోయాయని విమర్శించారు. ఎన్నికల ముందు పాదయాత్రలో రాష్ట్రానికి ప్రత్యేకహోదా విషయమై పోరాడతామని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినా, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కంటూ... విభజన హామీలను వెంటనే అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్ చైతన్య, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు సులేమాన్‌తో పాటు నాయకులు అరుణ్, నరేంద్ర, సురేంద్ర, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తూరులో

# ప్రీ క్రిస్మస్ వేడుకలు

నెల్లూరు శివారుల్లోని కొత్తూరు శ్రామికనగర్‌లో జీసెస్ బ్లెస్డ్ చర్చిలో ఈనెల 20న ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్రైస్తవ భక్తి గీతాలు గానం చేశారు. 'క్రీస్తు జననం' నాటికను ప్రదర్శించారు. చర్చి పాస్టర్ జ్ఞానశీలన్ క్రిస్మస్ వేడుకల సందేశాన్ని తెలియజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

## రోడ్లు భవనాలశాఖ ఉద్యోగుల..

# నూతన కార్యవర్గం

రోడ్లు భవనాల శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌కె చింగీషా, కార్యదర్శిగా ఎన్‌వి సురేస్, కోశాధికారిగా జి.శంకరయ్య తదితరులు ఎన్నికయ్యారు. మొత్తం ఇరవై మందితో కమిటీ ఎన్నికైంది. కొత్త కార్యవర్గాన్ని ఉద్యోగులు సత్కరించారు.

# గంజాయి స్వాధీనం

నెల్లూరు, ఏసి సుబ్బారెడ్డి స్టేడియం సమీపంలో ఈనెల 21న సెబ్ అధికారులు జరిపిన తనిఖీల్లో ఆర్టీసి బస్సుల్లో గంజాయిని తీసుకువెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 15.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కర్నాటకకు చెందిన నాగరాజు కిరణ్‌కుమార్ 3.50 కేజీలు, మరో ఆర్టీసి బస్సులో కర్నాటకకు చెందిన మురుగన్ వద్ద 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు సెబ్ ఇన్స్‌పెక్టర్ కెపి కిషోర్ పేర్కొన్నారు.

# చెన్నైలో 25న ఘంటసాల శతజయంతి వేడుకలు



అమరగాయకుడు ఘంటసాల

చెన్నైలో ఈనెల 25న మధురగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. తమిళనాడు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ఆ సంఘం అధ్యక్షులు తమ్మినేని బాబు అధ్యక్షత వహించనున్నారు. పెరంబూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శ్రీ నమ్మాళ్వార్ శ్రేష్టి ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీకవి భువనచంద్ర, వేద విజ్ఞానవేదిక గౌరవాధ్యక్షులు జెకెరెడ్డి, 'జనని' సంస్థ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్యతో పాటు ఆచార్య విస్తాలి శంకరావు, అరుణాశ్రీనాధ్, ఎన్.వసుంధరాదేవి, వంజరపు శివయ్య, పి.ఆర్ కేశవులు, కె.రమాదేవి తదితరులు పాల్గొననున్నారని, ఈ సందర్భంగా లలిత్ గీతాంజలి ఆర్కెస్ట్రా అధినేత ఎంఆర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘంటసాల మధురగీతాలను ఆలపించనున్నారని నిర్వాహకులు తెలియజేశారు.

## సైకిల్ డిజైన్‌పై..

# ఎన్‌బికెఆర్‌లో శిక్షణా తరగతులు



సైకిల్ డిజైన్‌పై సందేహాలను నివృత్తి చేసుకుంటున్న విద్యార్థులు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బి కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇటీవల రెండు రోజుల పాటు సైకిల్ డిజైన్‌పై విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్ ఇండియా సదరన్ సెక్షన్(ఎస్‌ఏఇఐ ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఈ తరగతులు జరిగాయి. ఈ వర్క్‌షాప్‌లో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పలు ఇంజనీరింగ్ కాలేజీల నుంచి 168 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ విక్రమ్‌కుమార్ పాల్గొని కొత్త ఉత్పత్తుల అభివృద్ధిలో డిజైన్ ఇంజనీర్ల పాత్రను వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి వారు నూతన ఆవిష్కరణలను చేపట్టేందుకు ఇలాంటి శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చెన్నైకి చెందిన టిఐ సైకిల్స్ సీనియర్ మేనేజర్ పి.రామచంద్రన్, ఫ్రీలాన్స్ డిజైన్ కన్సల్టెంట్ పి.చాందిని, సి.వరదరాజన్‌లు ఈ వర్క్‌షాప్‌కు రిసోర్స్‌పర్సన్‌లుగా వ్యవహరించారు. సైకిల్ డిజైన్లలో మెళకువలను వారు విద్యార్థులకు తెలియజెప్పారు. ఎస్‌ఏఇ ఇండియా దక్షిణ విభాగం కార్యదర్శి డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, డా. ఎం.భారతిరాజా తదితరులు ఈ శిక్షణా తరగతులను పర్యవేక్షించారు.

# కోరిన వరాలిచ్చే దేవుడు.. 'పొట్టేపాళెం' కోదండరాముడు

శ్రీరామ రామ రామేతి..
రమే రామే మనోరమే!
సహస్రనామ తత్తుల్యం..
రామనామ వరాననే!.. అంటూ కీర్తిస్తున్నాయి మన పురాణాలు. రామనామం అమృత తుల్యమైనది. ఎందుకంటే, 'ఓం నమో నా'రా'యణాయ'.. అనే మంత్రంలోని 'రా' అనే అక్షరం, 'ఓం న'మ': శివాయ' మంత్రంలోని 'మ' అనే అక్షరం కలిపి.. 'రామ' అయింది. అందుకే అది మహా మహిమాన్వితమైన తారకమంత్రమైంది. రామ మంత్రమే ముక్తికి సోపానం. జ్ఞానాన్ని, మోక్షాన్ని ఇచ్చేది శ్రీరామ నామమే. అన్ని కష్టాలను తీర్చేది..సకల శుభాలను చేకూర్చేది ఒకే ఒక్క రామ నామమే. మనదేశంలో రామభక్తులకు కొదవే లేదు. అసలు రామనామం వినిపించని చోటు, రామాలయం లేని ఊరు భారతావనిలో ఉండవంటారు పెద్దలు. మన జిల్లాలోనూ ఎన్నో అద్వితీయమైన రామాలయాలున్నాయి. వాటిలో ఒకటి.. నెల్లూరు సమీపంలోని పొట్టేపాళెం గ్రామంలో వెలసి ఉన్న సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండ రామాలయం. ఎంతోకాలంగా ఈ ఆలయం భక్తాదులను ఆకట్టుకుంటూ ఉంది. ఈ ఆలయం ఆవిర్భావం వెనుక ఆసక్తి కరమైన చరిత్ర, కథనాలు కూడా ఉన్నాయి.

## నూరేళ్ల పూర్వం నాటి దేవాలయం :

కష్టాలు తీర్చి శుభాలు చేకూర్చే దివ్యమైన ఆలయంగా పొట్టేపాళెం కోదండరామాలయం ప్రతీతి. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా కోదండరాముడు ప్రసిద్ధి. ఇప్పటికి సుమారు 105 సంవత్సరాల కిందటి ప్రముఖ రామాలయం ఇది. నిరంతరం రామభక్తితో తరించే తిక్కవరపు వెంకురెడ్డి అనే జమీందారు వంశస్థుడు పొట్టేపాళెం గ్రామంలో 1916 ప్రాంతంలో అక్కడ కోదండరామాలయాన్ని నిర్మించారు. సుమారు రెండెకరాల విశాలమైన ప్రదేశంలో సర్వాంగసుందరంగా ఆలయం నిర్మించి శ్రీరాముని పట్ల తనకున్న భక్తిని చాటుకున్నాడు.








గర్భాలయంలో సీతా లక్ష్మణ సమేతుడైన కోదండరాముని విగ్రహమూర్తులను ప్రతిష్టించి నిత్యపూజలు, ఏటా ఉత్సవాలు జరిపేవారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ ఆంజనేయస్వామి మందిరం కూడా నెలకొల్పారు. కాలక్రమంలో ఆయన మనుమడు దయాకర్‌రెడ్డి-మహాలక్ష్మమ్మ దంపతులు కూడా రామభక్తితో జీవితాల్ని కొనసాగిస్తూ స్వామివారి ఆలయంలో నిత్యకైంకర్యాలకు ఏ లోటూ లేకుండా కొంత భూమిని కూడా వితరణ గావించినట్లు చెప్తున్నారు. క్రమేణా గ్రామస్తులు, భక్తులు, దాతల సహకారంతో ఈ ఆలయం అభివృద్ధి చెందుతూ వచ్చింది. 2011లో గ్రామస్తులు, స్థానిక ప్రముఖులందరూ కలసి సుమారు రెండు కోట్ల రూపాయల భారీ వ్యయంతో ఆలయ జీర్ణోద్ధరణ గావించి సుందరంగా తీర్చిదిద్దడం విశేషం. గ్రామానికి చెందిన ప్రముఖ దాతలు పొన్నాల వెంకటశేషారెడ్డి-శోభావతమ్మ దంపతులు ఈ ఆలయానికి రాజగోపురం నిర్మాణం చేయించగా, అల్లారెడ్డి కాంతమ్మ, బండి శ్రీకాంత్‌రెడ్డి తదితర దాతల ఆధ్వర్యంలో ఆలయ ధ్వజస్తంభం ఏర్పాటుచేశారు. అంగరంగ వైభవంగా కుంభాభిషేక మహోత్సవం కూడా జరిగింది. 2014లో రాజగోపురం సంప్రోక్షణ జరిగింది. ఆలయ ముఖమండపంతో పాటు, నవగ్రహ మండపం, వినాయకుని మందిరం, కల్యాణ మండపం వగైరాలన్నీ పొన్నాల కుటుంబం వారు నిర్మాణం చేయించారు. ఇప్పుడు ఈ ఆలయానికి ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా ఉన్న పొన్నాల వెంకటశేషారెడ్డి తనయుడు పొన్నాల రామచంద్రారెడ్డి కూడా అచంచల రామభక్తితో ఆలయ అభివృద్ధికి సేవలందిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆలయం దేవాదాయశాఖ పరిధిలో ఉంది. ఆలయ కార్యనిర్వహణాధికారి కొడాలి పెంచలవరప్రసాద్ ఆధ్వరంలో ఆలయ పాలన, అర్చకుడు పరాంకుశం కులశేఖరాచార్యుల వారిచే స్వామివార్లకు నిత్యపూజలు, సేవలు నిరంతరం వైభవంగా జరుగుతున్నాయి.

## 13 రోజుల పాటు శ్రీరామనవమి :

సాధారణంగా అనేక రామాలయాల్లో 3 రోజుల పాటు, మరికొన్ని చోట్ల వారం, పది రోజుల దాకా శ్రీరామనవమి ఉత్సవాలు జరుగుతుంటాయి. ఈ ఆలయంలో ఏకధాటిగా 13 రోజుల పాటు స్వామివార్లకు అలంకారాలు, పూజలు, వాహనసేవలతో శ్రీరామనవమి ఒక పెద్ద తిరునాళ్ళలాగా జరుగుతుంటుంది. ప్రతిఏటా ముక్కోటి ఏకాదశినాడు వైకుంఠ ద్వారదర్శనం కూడా ఈ ఆలయం ప్రత్యేకత. ప్రతి శనివారం కన్నుల పండువగా పల్లకి సేవ ఉంటుంది. ప్రతి ఏటా హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే ఆ కోదండరాముడిని ప్రతినిత్యం అనేక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకుని తరిస్తుంటారు.

# కళ్యాణ వైభవం...!

స్నేహ - మహేశ్వర



సోమవరపు రవికుమార్‌రెడ్డి - సునందల కుమార్తె
స్నేహ - మహేశ్వరల వివాహం డిసెంబర్ 19వ తేదీ హైదరాబాదులో ఘనంగా జరిగింది.
కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

వరుణ్ - ప్రీతి



'రాజీ యాడ్స్' మోపూరు పెంచలయ్య - రాజేశ్వరిల కుమారుడు
డా॥ పెంచల వరుణ్ - డా॥ జయ ప్రీతిల కళ్యాణం డిసెంబర్ 9వ తేదీ జరిగింది.
వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

# మన ఎస్పీ.. క్రికెట్ భలే ఆడారు



- 50 పరుగులు చేసి ఆశ్చర్యపరిచిన పోలీసు బాస్
- స్పోర్ట్స్‌మీట్‌లో పోలీసుల్లో ఉరకలెత్తిన ఉత్సాహం

విధి నిర్వహణలో ఎంతో కరకుగా, నిక్కచ్చిగా ఉండే జిల్లా పోలీసుబాస్ ఒక్కసారిగా అద్భుతమైన క్రీడాకారునిగా మారిపోయారు. క్రీడల్లో కూడా పోలీసు అధికారులు తక్కువేమీ కాదంటూ నిరూపిస్తూ క్రికెట్ మ్యాచ్ అద్భుతంగా ఆడి జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు తన సత్తా చూపారు. జిల్లాలోని పోలీసులతో కలసి క్రికెట్‌లో పాల్గొని ఎంతో ఉత్సాహంగా పరుగులు తీస్తూ అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. క్రికెట్ బ్యాట్ పట్టుకుని ఎస్పీ పరుగులు తీస్తుంటే పోలీసుల సంతోషం అంతా ఇంతా కాదు. చప్పట్లు మార్మోగిపోయాయి. 'అబ్బో!..మన ఎస్పీ గారు క్రికెట్ భలే ఆడుతున్నారే'.. అంటూ పోలీసులు మురిసిపోయారు. మహిళా పోలీసులు ఆనందంతో కేరింతలు కొట్టారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 50 పరుగులు తీసి జిల్లా ఎస్పీ అందరినీ అబ్బుర పరిచారు. సిఐ మధుబాబుతో కలసి మ్యాచ్‌లో పాల్గొని అందరికీ ఉత్సాహం కలిగించారు. దీంతో పోలీసుల జిల్లా స్పోర్ట్స్ మీట్ పెద్ద సంబరంగా మారింది. నెల్లూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న పోలీసుల స్పోర్ట్స్‌మీట్ రెండవరోజైన బుధవారం (ఈనెల 23) జిల్లా ఎస్పీతో పాటు అన్ని సబ్‌డివిజన్ల నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని తమ క్రీడాప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విజయారావు మాట్లాడుతూ పోలీసుశాఖలో పనిచేసే ప్రతిఒక్కరికి క్రమ శిక్షణ, దేహదారుఢ్యం ముఖ్యమని, అది క్రీడలతో సాధ్యమవుతుందని, విధి నిర్వహణలో అనునిత్యం ఎన్నో సవాళ్ళను, ఒత్తిడులను ఎదు ర్కొంటున్న పోలీసులకు మానసిక దృఢత్వానికి క్రీడలు ఉపయోగపడతాయని, క్రీడలు, వ్యాయామం, యోగా వంటివి పోలీసు సిబ్బందికి ఎంతో అవసరమని, వీటిని ప్రతిఒక్కరూ క్రమ శిక్షణతో అలవరుచుకోవాలని సూచించారు.

## సందడిగా జె.కె.రెడ్డి 80వ పుట్టినరోజు



మాజీ శాసన సభ్యులు జేకే రెడ్డి 80వ పుట్టినరోజు సందర్భంగా, డిసెంబర్ 23 వ తేదీ మధ్యాహ్నం నెల్లూరులోని జక్కా సుజాతమ్మ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం చేస్తున్న ఆయన కుమార్తె పద్మ, కోడలు స్మిత, అకౌంటెంట్ రామారావు, జేకే రెడ్డి ప్రియశిష్యుడు సురేష్‌కుమార్.



మేనమామ 80వ పుట్టిన రోజు సందర్భంగా అభినందనలు తెలుపుతున్న జేకే రెడ్డి మేనల్లుడు, వైఎస్ఆర్ సీపీ నాయకుడు బట్టేపాటి నరేంద్రరెడ్డి.

# రాష్ట్రంలో యదేచ్ఛగా ఇసుక దోపిడీ - సోమిరెడ్డి



రాష్ట్రంలో ఇసుక దోపిడీ యధేచ్ఛగా జరిగిపోతోందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 22న అమరావతిలోని తాడేపల్లిలో టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుకరీచ్‌లు జేపీ కంపెనీపరం చేశాక వారేం చేసినా జోక్యం చేసుకునేది లేదంటూ గనులశాఖ చెప్పడం బాధ్యతారాహిత్యమని, నదుల మధ్యలో రోడ్లు వేయడం, తవ్వకాలు చేయడం నిషేధమని అధికారులకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలోని నదుల నుంచి రోజుకి 2వేల లారీల ఇసుక పొరుగు రాష్ట్రాలకు అనధికారికంగా తరలిపోతోందని, వేలకోట్ల దోపిడీ జరిగిపోతోందని ఆయన ఆరోపించారు.

# మార్చి తర్వాతే మార్పు?


(మొదటి పేజీ తరువాయి)

ఆ బాధ్యతలను పార్టీ శ్రేణులకంటే అధికారులకే ఎక్కువగా అప్పజెప్పడంతో వీళ్లకు పనే లేకుండా పోయింది. ఒక్కొక్క జిల్లాకి 4 నుండి 5 మందిని అదనపు జిల్లా కలెక్టర్లను నియమించడంలోనే అధికార వ్యవస్థపైన ముఖ్యమంత్రికున్న నమ్మకం అర్థమైపోతుందంటున్నారు మేధావులు. పరిపాలనపైన ముఖ్యమంత్రికి స్పష్టమైన అవగాహన ఉందని అందుకనే ఆయన మంత్రులని ఎమ్మెల్యేలని, పార్టీ శ్రేణులని నమ్ముకోకుండా పూర్తిగా అధికారులపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారన్నది కూడా వారి అభిప్రాయం. ఈ క్రమంలోనే సీఎం వాళ్లకి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నది కూడా వారి భావన.

## పరిశీలనలో పాతిక జిల్లాలు పాతికమంది మంత్రులు...

కొత్త మంత్రివర్గంపై కసరత్తు చేయవలసిన అవసరం కూడా లేదని, ఎవరెవరికి పట్టం కట్టాలో ఇప్పటికే ముఖ్యమంత్రి వద్ద లిస్టు తయారుగా ఉందని పార్టీ వర్గాల సమాచారం. కరోనా మళ్ళీ 'ఒమిక్రాన్' రూపంలో విజృంభిస్తుందన్న సంకేతాలు, పాత మంత్రుల అభ్యర్థనతో పాటు పాతిక జిల్లాల కసరత్తును కూడా దృష్టిలో పెట్టుకుని మంత్రివర్గ విస్తరణ ఉంటుందని తాడేపల్లి సమాచారం. పాతిక జిల్లాలకు పాతికమంది మంత్రులు అన్న మాట కూడా బలంగానే వినపడుతోంది. ఖచ్చితంగా కనీసం ఆరునెలల ముందైనా ముందస్తు ఎన్నికలకు వెళ్లారని జరుగుతున్న ప్రచారం కూడా ఇప్పుడిప్పుడే జోరందుకుంటోంది. మరోవైపు ఏ క్షణమైనా జమిలి అంశాన్ని కేంద్రం తెరపైకి తెచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో కొత్త మంత్రుల నియామకం ఇంకా ఆలస్యంచేస్తే వాళ్ళు సర్దుకునేలోపే మళ్ళీ ఎన్నికలు వచ్చేస్తాయన్న నిరుత్సాహం కూడా ఆశావహుల్లో ఉంది. ఏదిఏమైనా జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఇటు ప్రభుత్వంలోనూ, అటు పార్టీలోను ఆయన ముద్రే ప్రధానంగా ఉందన్నది కాదనలేని సత్యం. జగన్‌తోనే జనం, జనమే జగన్. అలాంటి పరిస్థితులలో మంత్రివర్గ మార్పులు మార్చి తరువాత జరిగినా అసలు జరగక పోయినా, ప్రభుత్వానికీ, పార్టీకి, ప్రజలకి పెద్దగా నష్టమేమీ లేదన్నది కూడా అనేకమంది అభిప్రాయం.

# ఆనం వివేకాకు నివాళి



సింహపురి రాజకీయాల్లో తనదంటూ విలక్షణమైన శైలితో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి 71వ జయంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు ఘన నివాళులు అర్పించారు. వివేకా ఆత్మీయతను వారంతా గుర్తుచేసుకున్నారు. జిల్లా రాజకీయ రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ నెల 23వ తేదీ గురువారం నెల్లూరు, ఏసీ నగర్‌లోని వివేకా సమాధి వద్ద వారంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకా సోదరులు, డీసీసీబీ బ్యాంక్ మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, వివేకా తనయుడు ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్ డిస్ట్రిక్ట్ ఉత్తమ గవర్నర్‌గా.. ఏకొల్లు రాఘవరెడ్డి



మంత్రి వెల్లంపల్లి నుండి అవార్డునందుకుంటున్న ఏకొల్లు రాఘవరెడ్డి

వాకర్స్ 203 జిల్లాకు డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా 2021వ సంవత్సరానికి ఏకొల్లు రాఘవరెడ్డికి ఉత్తమ అవార్డు లభించింది. ఇటీవల విజయవాడలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో ఆయన ఈ అవార్డునందుకున్నారు. కరోనా కష్టకాలంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందుకోవడం విశేషం. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ హనుమంతురావు, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి వెల్లంపలి శ్రీనివాస్, వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. వాకర్స్ క్యాబినెట్ సెక్రటరీ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు విశేష సేవలందిస్తున్న నలుబోలు బలరామయ్యనాయుడుకు 2020, 2021 సంవత్సరాలకు 'బెస్ట్ క్యాబినెట్ సెక్రటరీ'గా అవార్డును బహూకరించారు. అవార్డు గ్రహీతలను వాకర్స్ అందరూ అభినందించారు.

# జడ్పీ స్టాండింగ్ కమిటీల ఎన్నికలు

- మొత్తం 7 కమిటీలు..ఒక్కో కమిటీలో 9 మంది సభ్యులు
- సభ్యుల్లో జడ్పీటీసీలతో పాటు..మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

*జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల (స్థాయీ సంఘాలు) ఎన్నికలు ఇటీవల ప్రశాంతంగా జరిగాయి. వివిధ సంఘాలకు జిల్లాలోని జడ్పీటీసీలను సభ్యులుగా నియమించారు. ఒక్కో కమిటీలో తొమ్మిది మంది సభ్యులను నియమించారు. కమిటీల్లో సభ్యులుగా జడ్పీటిసిలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎన్నికైన సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ సిఇఓ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఏ సంఘానికి ఎవరు ఎంపికైందీ వివరాలివీ!....*

### 1. ప్రణాళిక–ఆర్థిక సంఘం కమిటీ

ఈ కమిటీలో సభ్యులుగా జడ్పీటీసీలు తాళ్ళూరు స్వరూపారాణి (దగదర్తి), రాపూరు వెంకటసుబ్బారెడ్డి (అనంతసాగరం), తుమ్మల లక్ష్మయ్య (విడవలూరు), రౌతు రామకృష్ణ (వాకాడు), గుంటమడుగు రవీంద్రరాజు (ఓజిలి), పాటూరు మాల్యాద్రిరెడ్డి (కలిగిరి), గణపం బాలకృష్ణారెడ్డి (వింజమూరు), బులగాకుల అనిల్‌కుమార్‌రెడ్డి (కలువాయి)తో పాటు కోఆప్షన్ సభ్యులుగా షేక్ గాజుల తాజుద్దీన్ ఎన్నికయ్యారు.

### 2. స్త్రీ శిశు సంక్షేమ కమిటీ

ఈ కమిటీలో సభ్యులుగా జడ్పీటీసీలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ (ఏఎస్‌పేట), రావుల లక్ష్మి(సంగం), కె.శ్రీలత (కోవూరు), ఉగ్గుముడి సుప్రియ (సూళ్ళూరుపేట), మేదరమెట్ల శివలీల (జలదంకి), ఎంబేటి శేషమ్మ (తోటపల్లిగూడూరు), ఊటుకూరి యామిని (గూడూరు)లతో పాటు గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

### 3. గ్రామీణాభివృద్ధి కమిటీ :

ఈ కమిటీలో సభ్యులుగా జడ్పీటీసీలు రామాంజనేయులు (ఉదయగిరి), కె.జ్యోతి (నాయుడుపేట), చెరుకుపల్లి రమణారెడ్డి (సీతారామపురం), దాసరి కోటయ్య (కోట), చిత్తలూరి పోలయ్య (సైదాపురం) లతో పాటు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

### 4. సాంఘిక సంక్షేమ కమిటీ

ఈ కమిటీలో సభ్యులుగా జడ్పీటీసీలు చిగురుపాటి ప్రసన్న (రాపూరు), చిప్పల వెంకటయ్య (చిట్టమూరు), చలంచర్ల వనమ్మ (అల్లూరు), కె.ఇందుమతి (తడ), బందెల వెంకటరమణయ్య (ముత్తుకూరు), పొట్లూరి సుబ్రహ్మణ్యం (వెంకటాచలం) లతో పాటు తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తిలు ఎన్నికయ్యారు.

### 5. వ్యవసాయ కమిటీ :

ఈ కమిటీలో సభ్యులుగా జడ్పీటీసీలు శ్రీహరికోట విజయలక్ష్మమ్మ (ఇందుకూరుపేట), మల్లు సుధాకర్‌రెడ్డి (మర్రిపాడు), సూరా ప్రదీప (బుచ్చిరెడ్డిపాళెం), పి. నన్నం (పెళ్లకూరు)లతో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎన్నికయ్యారు.

### 6. విద్య–ఆరోగ్య కమిటీ

ఈ కమిటీలో సభ్యులుగా జడ్పీటీసీలు పి.ప్రసన్నలక్ష్మి (ఆత్మకూరు), సింగిశెట్టి అమరసాయి (బాలాయపల్లి), మద్దిబోయిన కీర్తన (బోగోలు), పసుపులేటి సరోజనమ్మ (కొడవలూరు), రావిళ్ళ నాగేంద్ర (వరికుంటపాడు), తెనాలి నిర్మల (పొదలకూరు)లతో పాటు ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు.

### 7. నిర్మాణ కమిటీ :

ఈ కమిటీలో సభ్యులుగా జడ్పీటీసీలు జంపాని రాఘవులు (కావలి), పీర్ల పార్థసారధి (చేజర్ల), మన్నెం శీనయ్య (చిల్లకూరు), టి.రమేష్ (దొరవారిసత్రం), యల్లావుల వెంకట్రావు (కొండాపురం), లెక్కల లక్ష్మీకాంతమ్మ (దుత్తలూరు), చిట్టమూరు అనితమ్మ (మనుబోలు), కోలా వెంకటేశ్వర్లు (వెంకటగిరి)తో పాటు కో–ఆప్షన్ సభ్యుడుగా షేక్ అల్లాబక్ష్ ఎన్నికయ్యారు.


## 'మనిషాక పద్యం' కవితా సంపుటికి

# 'పెరసం' పురస్కారం



కవి నాగేశ్వరరావును సత్కరిస్తున్న పెరసం సభ్యులు

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 19న స్థానిక టౌన్ హాలు రీడింగ్ రూమ్‌లో జరిగిన సాహితీ కార్యక్రమంలో విజయవాడకు చెందిన కవి మెట్టా నాగేశ్వరరావు రచించిన 'మనిషాక పద్యం' కవితా సంపుటికి పెన్నా సాహిత్య పురస్కారం లభించింది. పెరసం నిర్వాహకులు మోపూరు పెంచలనరసింహం, అవ్వారు శ్రీధర్‌బాబు, తోట సులోచన తదితరులు నాగేశ్వరరావును ఘనంగా సన్మానించి పురస్కారం అందజేశారు. గత పన్నెండేళ్ళుగా పెరసం ఆధ్వర్యంలో ఈ పురస్కారాలను అందజేస్తున్నామని, తెలుగు భాషా సాహిత్యాన్ని ప్రోత్సహించడమే పెరసం లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు ఇంద్రగంటి మధుసూదన్, ఉషారాణిలను ఘనంగా సత్కరించారు. తొలుత నిర్వహించిన కవిసమ్మేళనంలో సుమారు 50 మందికి పైగా కవులు పాల్గొని తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు, కవయిత్రులు, సాహితీవేత్తలు మెట్టు రామచంద్రప్రసాద్, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, చిన్ని నారాయణరావు, మాటేటి రత్నప్రసాద్, సర్వేపల్లి రామమూర్తి పాల్గొన్నారు.

# ఉత్తరక్రియలు



జననం : 06-07-1947 నిర్యాణం : 20-12-2021

మా పెద్దదిక్కు, మాకు మార్గదర్శి, మమ్మల్ని తీర్చిదిద్దిన మా దైవం

## అన్నదేవుల సుధాకరరెడ్డి గారు

డిసెంబర్ 20, 2021 సోమవారం ఉదయం పరమపదించారు.

వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమార్తెలు - అల్లుళ్ళు

**గుండ్రా పద్మావతి - గుండ్రా సతీష్‌రెడ్డి**
చైర్మెన్, డిఆర్‌డిఓ

**నాగూరు శిల్ప - నాగూరు మనోహర్‌రెడ్డి**

మనుమలు, మనుమరాళ్ళు

**గుండ్రా స్నిగ్ధ, గుండ్రా అనూష్‌రెడ్డి**
**నాగూరు ప్రీతిక, నాగూరు శ్రీమాన్‌రెడ్డి**

తమ్ముని కుమారులు

**అన్నదేవుల శివకుమార్‌రెడ్డి**
**అన్నదేవుల సాయికుమార్‌రెడ్డి**

## ఉత్తరక్రియలు

వారి పెద్దకర్మ తే 30-12-2021ది, గురువారం ఉదయం 10.30 గంటలకు, నెల్లూరు, టెక్కేమిట్టలోని వారి స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com